


ప్రభుత్వ భవనాలపై.. ఫోకస్

గడువు ఇలా..

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్‌లకు సంబంధించిన పనులు ఆరు మాసాల్లోగా పూర్తి చేయాలి.
- ఏఐఎస్ కార్యదర్శులకు సంబంధించి 90 బంగ్లాలు, ప్రిన్సిపల్ కార్యదర్శులకు 25 బంగ్లాలు, మంత్రులకు 35, హైకోర్టు జడ్జిలకు 36 బంగ్లాలను నిర్మిస్తున్నారు. ఈ పనులను తొమ్మిది నెలల్లో పూర్తి చేసి అప్పగించాలి.



పునర్నిర్మాణం జరుపుకుంటున్న ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలు

టెండర్లు పూర్తి.. మొదలైన పనులు

- పెండింగ్ పనులకు రూ.1112.74 కోట్లు
- రాజధానిలో రంగంలోకి దిగిన కాంట్రాక్టు సంస్థలు
- 4043 ప్రభుత్వ నివాసాల పూర్తికి గడువు నిర్దేశం

వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని పాడుపెట్టగా కూటమి ప్రభుత్వం తిరిగి గతంలో నిలిచిపోయిన పనులను పట్టాలెక్కిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ భవనాలకు తొలి ప్రాధాన్యం ఇస్తూ పనులను పూర్తి చేయడంపై దృష్టి సారించింది. గతంలో చాలావరకు నిర్మాణాలు పూర్తి చేసుకుని వైసీపీ హయాంలో పాడుబడిన భవనాలను ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత పరిశీలించి వాటిపై దృష్టి సారించాలని సీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా పనులను పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏ ఇటీవల టెండర్లు నిర్వహించింది. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థలు రాయపూడికి చేరువగా ఈ-3, ఈ-4 రోడ్ల మధ్య 59.46 ఎకరాల్లో ఏఐఎస్, పిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, న్యాయమూర్తులకు చెందిన నివాస భవన నిర్మాణాలను చేపట్టాయి. 2019 నుంచి పాడుపడిన భవనాల సముదాయంలో పెద్ద ఎత్తున కమ్మేసిన ముళ్ల కంపలను తొలగించి శుభ్రం చేశాయి. అసంపూర్తి భవనాలను పరిశీలించి ఎక్కడెక్కడ ఏమేమి పనులు చేపట్టాలన్న దానిపై ఆయా కాంట్రాక్టు సంస్థల ఇంజనీర్లు కసరత్తులు చేస్తున్నారు. ఏఐఎస్, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, హైకోర్టు జడ్జిలకు సంబంధించిన బంగ్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఏడాది గడువు విధించింది. దీంతో ఆయా పనులు శర వేగంగా చేపట్టేందుకు కాంట్రాక్టు సంస్థలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతిలో ప్రభుత్వ సెక్టారులో తొలివిడతగా 4043 నివాసాల పూర్తికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో వీటి నిర్మాణ పనులు క్రమంగా ఊపందుకుంటున్నాయి. ఇవన్నీ గత 2019 నాటికి మొదలు పెట్టి చాలా వరకు పూర్తయినవే. అయితే వైసీపీ ప్రభుత్వ పుణ్యమా అంటూ అవన్నీ గత ఐదేళ్లుగా పాడుపడి ఉన్నాయి. ఇపుడీ భవన సముదాయాలన్నింటినీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. ఆలిండియా సర్వీసెస్ కార్యదర్శుల బంగ్లాలు, మంత్రులు, న్యాయమూర్తుల విల్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లు, ఐఏఎస్ అధికారుల క్వార్టర్లు ప్రధానంగా ఉన్నాయి. ఈ భవన

(మిగతా 6వ పేజీలో)

నిధులు ఇలా..

ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలకు రూ.411.37 కోట్లు, మంత్రులు, న్యాయమూర్తుల విల్లాలకు రూ.401.37 కోట్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లకు రూ.300 కోట్లు కేటాయించారు. వీటికి సంబంధించి తాజాగా టెండర్లను పిలవగా కేఎంవీ సంస్థ దక్కించుకుంది. ఏఐఎస్ బంగ్లా ఒక్కోటి నాలుగు వేల చ.అడుగుల విస్తీర్ణంలో, ప్రిన్సిపల్ కార్యదర్శుల బంగ్లాలు ఐదు వేల చదరపు అడుగుల్లో ఏర్పాటవుతున్నాయి. మంత్రులు, న్యాయమూర్తుల కోసం 26.09 ఎకరాల్లో 71 బంగ్లాల నిర్మాణ పనులను బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ సంస్థ రూ.401.37 కోట్లతో చేపట్టింది. ఇవి ఆరు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+1 విల్లాల రూపంలోనే ఉంటాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం రాయపూడి ప్రాంతంలోనే సీడ్ యాక్సిస్ రోడ్డు వెంబడి పన్నెండేసి అంతస్తులతో కూడిన 18 టవర్ల(432 ఫ్లాట్‌లు)ను గతంలో రూ.450 కోట్లతో నిర్మించారు. ఇవన్నీ దాదాపు సివిల్ వర్కులను పూర్తి చేసుకున్నాయి. వీటిలో ఇంటీరియర్ వర్కులు, ఇతర మౌలికవసతులను కల్పించాల్సి ఉంది. ఆయా పనులకు రూ.300 కోట్లను కేటాయించి ప్రభుత్వం టెండర్ నిర్వహించగా ఎన్‌సీసీ సంస్థ దక్కించుకుంది.



భవన సముదాయాల మధ్య ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేస్తున్న దృశ్యం

అభివృద్ధే లక్ష్యం

- టూరిజం, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి
- సాగునీటి కాల్వల ఆధునీకరణ, గ్రీన్‌ఫీల్డ్ పోర్టు సాధన

- జిల్లా వృద్ధి రేటు ప్లస్ 1.02, తలసరి ఆదాయం రూ.2,76,038
- కలెక్టర్ల సదస్సులో జిల్లా అభివృద్ధి ప్రణాళికపై సీఎం చంద్రబాబు
- సమస్యలతో పాటు అభివృద్ధి ప్రణాళికలను వివరించిన కలెక్టర్ వెంకటమురళి



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా అభివృద్ధే లక్ష్యం కావాలి. ఎంత ఖర్చవుతుందనే దాని గురించి ఆలోచన వద్దు. కేంద్రంతో సమన్వయం చేసుకుని అన్నీ సాధించుకుందాం. సాగునీటి కాల్వల ఆధునికీకరణ, ఫిషింగ్ హార్బర్‌తో పాటు మోటుపల్లి గ్రీన్‌ఫీల్డ్ పోర్టు సాధన వరకు జిల్లాకు సంబంధించి అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసే దిశగా చర్యలు చేపడతాం..' అని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో బుధవారం జిల్లాకు సంబంధించి కలెక్టర్ వెంకటమురళి వివరించిన అనేక అంశాలపై సీఎం స్పందించారు. జోన్-3లో ఉన్న బాపట్ల జిల్లా వృద్ధి రేటులో ప్లస్ 1.02 నమోదు చేసిందని, తలసరి ఆదాయం ఏడాదికి రూ.2,76,038 గా ఉందన్నారు. రాష్ట్ర సగటు తలసరి ఆదాయం కన్నా జిల్లా దిగువనే ఉందన్నారు. జిల్లా కేంద్రంలో డయాలసిస్, ట్రామా సెంటర్ ఆవశ్యకత గురించి కలెక్టర్ వివరించగా ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఆక్వాపార్కు విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ పురోగతి చూపెట్టాలన్నారు. రివర్ టూరిజం, కుందేరు డ్రెయిన్, వైద్య కళాశాల నిర్మాణాల గురించి కలెక్టర్ వివరించగా సీఎం సానుకూలంగా స్పందించారు. పర్యాటక రంగాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవడంతో పాటు సమాంతరంగా మౌలిక సదుపాయాలపై కూడా దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు. కలెక్టర్ వెంకటమురళి ఆక్వా పార్కు గురించి పీపీటీ ఇవ్వగా సీఎం మాట్లాడుతూ కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ అన్నీ చేద్దామని ముఖ్యమంత్రి చెప్పారు. ఆక్వా పార్కు నిర్మాణం విషయంలో కొత్తగా వచ్చిన పాలసీని కలెక్టర్ సీఎంకు వివరించగా బీచ్ రూంలతో పాటు టూరిజంపై పరిశీలించాలన్నారు. జిల్లాలోని సమస్యలను, అభివృద్ధి ప్రణాళికలను సీఎంకు కలెక్టర్ తెలిపారు. టూరిజం, ఆక్వా, లైవ్‌స్టాక్ రంగాలలో జిల్లా అభివృద్ధికి అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. టూరిజం పురోగతికి ఉన్న సానుకూలతలను సదస్సులో చెప్పడంతో పాటు ప్రస్తుతం తీసుకున్న చర్యలను వివరించారు. ఆక్వా రంగం ద్వారా కూడా జిల్లాలో ఉపాధి అవకాశాలు విస్తృతం చేయవచ్చని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సెర్ప్‌లో రూ.300 కోట్లు వరకు నిధులు ఉన్నాయని వాటిని లైవ్‌స్టాక్‌కు ఖర్చు పెట్టడం ద్వారా పదివేల కుటుంబాలకు సాయం అందించవచ్చన్నారు. కాల్వల ఆధునికీకరణకు మరో రూ.23 కోట్లు ఖర్చు అవుతుందని, కృష్ణా వరదలను తట్టుకునేలా కరకట్టలను పటిష్టం చేయాలని సీఎంకు కలెక్టర్ తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (గురువారం సాయంత్రం)

సహరి : 4.50 (శుక్రవారం ఉదయం)

ఈ-క్రాప్‌లో నమోదు.. 230 మంది మాత్రమే

- యార్డులో అమ్మకందారులంతా రైతుల వద్ద కొనుగోలు చేసిన వాళ్లే
- ఇతర రాష్ట్రాల వారికి ఇక్కడ ఎంఐ స్కీమ్ అమలు అసాధ్యం
- దీనిని అవకాశంగా మార్చుకొంటున్న కొందరు వ్యాపారస్థులు

8

రూ.5 లక్షల మిరప విత్తనాలు సీజ్

- మామిళ్లపల్లిలో రహస్యంగా రాత్రిళ్లు తయారీ
- విజిలెన్స్ దాడులు.. 7875 కేజీల నిల్వలు స్వాధీనం

అద్దంకి, గుంటూరు సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం మామిళ్లపల్లి సమీపంలోని పొలాల్లో అనుమతి లేకుండా మిరప విత్తనాలను ప్రాసెసింగ్ చేసి ప్యాకింగ్ చేస్తుండగా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు బుధవారం దాడి చేసి రూ.4,98,500 విలువైన 7875 కిలోల విత్తనాలను సీజ్ చేశారు. గుంటూరులోని ఆదర్శనగర్‌కు చెందిన చెన్నకేశవ ట్రేడర్స్ ప్రతినిధి సంపతి శ్రీనివాసరావు రెండు రోజుల నుంచి రాత్రి సమయంలో గ్రేడింగ్ మిషన్‌లు, ప్యాకింగ్ మిషన్‌లను ఉపయోగించి మిరప విత్తనాలు ప్రాసెసింగ్ చేస్తున్నట్లు విజిలెన్స్ ఎస్పీ దువ్వారపు సూర్యశ్రావణ్‌కుమార్‌కు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాలతో మామిళ్ళపల్లి గ్రామ శివారులో తెల్లగొర్ల వెంకటకృష్ణకు చెందిన వ్యవసాయ పొలంలో అత్యంత గోప్యంగా నకిలీ మిర్చి విత్తనాలు తయారు చేస్తున్న కేంద్రంపై బుధవారం తెల్లవారుజామున అధికారులు దాడులు చేశారు. రహస్యంగా కేవలం రాత్రి వేళల్లో మాత్రమే వీరు విత్తనాలను తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విత్తనాలు తీసుకువచ్చి వాటిని ప్రాసెసింగ్ చేసి పేరున్న కంపెనీల ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నారన్నారు. 3500 కేజీల నాసిరకం మిరప విత్తనాలు, రవాణాకు సిద్ధం చేసిన 4375 కేజీల విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ కేంద్రంలోని జనరేటర్, రెండు పెద్ద యంత్రాలు, ఒక కుట్టు మిషన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మిరప విత్తనాలు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి గ్రేడింగ్, ప్రాసెసింగ్ చేసి అధిక ధరలకు వ్యాపారులకు హోల్‌సేల్ గా అమ్మకాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. వ్యవసాయ అధికారి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు. సీజ్ చేసిన మిరప విత్తనాలను అద్దంకి సమీపంలోని కోల్డ్ స్టోరేజీలో ఉంచినట్లు ఏవో తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు కొమ్మాలపాటి చంద్రశేఖర్, శివాజీ, విజిలెన్స్ వ్యవసాయాధికారి ఆదినారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మామిళ్లపల్లి సమీపంలో పొలాలలో ప్రాసెసింగ్ చేసి ప్యాకింగ్ చేస్తున్న మిరప విత్తనాలను పరిశీలిస్తున్న రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు

ఎంపీపీ ఎన్నిక.. ఉత్కంఠ

- పిట్టలవానిపాలెం ఎంపీపీ ఎన్నిక నేడు
- క్యాంపు రాజకీయానికి తెరలేపిన వైసీపీ
- చివరి నిమిషంలో సమీకణాలు మారే అవకాశం!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పిట్టలవానిపాలెం మండలం ఎంపీపీ ఎన్నిక విషయంలో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. దీంతో గురువారం జరిగే ప్రక్రియపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మండల పరిధిలో ఉన్న 11 ఎంపీటీసీ స్థానాల్లో 10 వైసీపీ ఖాతాలోనే ఉన్నట్లు సమాచారం. కానీ ఎంపీపీ స్థానం చేజిక్కించుకోవడంలో నేతలను అభద్రతా భావం వెంటాడడంతో క్యాంపు రాజకీయానికి తెరలేపినట్లు సమాచారం. ఎన్నిక జరుగుతున్న ఎంపీపీ స్థానం స్థానిక ఎమ్మెల్యే సొంత మండలం కావడంతో చివరి నిమిషంలో మారే రాజకీయ సమీకరణాలపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. తొలుత చేసుకున్న ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తి కాగానే అప్పటి వరకు ఎంపీపీగా ఉన్న షేక్ బాజీ దాదాపు ఏడాది క్రితమే రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. మండల పరిధిలోని మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఒకరు గతంలోనే టీడీపీ బాట పట్టగా మరొకరు అంగీకారం తెలిపినట్లు సమాచారం. అయితే సంఖ్యాబలంగా చూస్తే వైసీపీకే మెజారిటీ ఉంది. కానీ ఎన్నిక చేతులెత్తే విధానంలో జరుగుతుండడం, వారిలో ఉన్న అంతర్గత కుమ్ములాటల మూలంగా చివరి నిమిషంలో రాజకీయ సమీకరణాలు మారితే మాత్రం దానిని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి టీడీపీ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

సాంకేతిక పరిజ్ఞానంతో గస్తీ

- అనుమానిత వ్యక్తుల వేలిముద్రల సేకరణ
- నెల రోజుల్లో జిల్లాలో 7,953 మంది వేలిముద్రల స్కాన్

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గస్తీ విధులలో పాల్గొనే పోలీసు సిబ్బంది నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ఎం.ఎస్.సి.డి పరికరం ద్వారా అనుమానితుల వేలిముద్రలను సేకరిస్తున్నారు. గడిచిన నెల రోజుల్లో జిల్లావ్యాప్తంగా 7,953 మంది అనుమానితుల వేలిముద్రలు సేకరించారు. ప్రధానంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఏటీఎంలు, బ్యాంక్‌లు, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో పోలీసులు విస్తృతంగా గస్తీ నిర్వహిస్తున్నారు. గస్తీ సిబ్బంది విధుల్లో ఉన్న సమయంలో ఎవరైనా అనుమానితులు తారసపడితే వారిని విచారించి వేలిముద్రను మొబైల్ సెక్యూరిటీ చెక్‌డ్ డివైజ్ పరికరం ద్వారా సేకరిస్తున్నారు. గతంలో వారు నేరం చేసి ఉంటే ఆ వివరాలు అందులో వస్తాయి. అనుమానితుడు వేలిముద్రలను స్కాన్ చేసి వారిపై ఎక్కడైనా కేసు నమోదైనట్లైతే ఆ వివరాలను తెలుసుకుని స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు సమాచారం అందిస్తున్నారు. తద్వారా ఆయా నేరగాళ్ల ఆటకట్టేందుకు పోలీసులకు అవకాశం ఏర్పడింది.

అన్ని పోలీస్‌స్టేషన్లలో అమలు : ఎస్పీ దూడీ

ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేవిధంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ పరిధిలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. ఇప్పటి వరకు స్కాన్ చేసిన వారిలో 17 మంది గతంలో వివిధరకాల కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అత్యవసర సమయంలో మినహా వివిధ కారణాలతో అర్ధరాత్రుళ్లు బయటకొచ్చేవారు తప్పనిసరిగా గుర్తింపుకార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. కార్డులేనివారిని అనుమానితులుగా పరిగణించి విచారించాల్సి ఉంటుందన్నారు. గస్తీ పోలీసులు ప్రశ్నించినప్పుడు వారికి సహకరించాలన్నారు.

మున్సిపల్ భూమి విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలి

● కేసానుపల్లి 167ఏ జాతీయ రహదారి బాధిత రైతుల డిమాండ్

నరసరావుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ భూమి విలువ ఆధారంగా రైతులకు పరిహారం చెల్లించాలని కేసానుపల్లి 167ఏ జాతీయ రహదారి బాధిత రైతులు డిమాండ్ చేశారు. బుధవారం నరసరావుపేటలో ఆర్డీవో ఎం మధులతకు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కేసానుపల్లి రైతుల పొలాల మార్కెట్ విలువ ఎకరం రూ. 3 నుంచి రూ. 5



ఆర్డీవో ఎం మధులతకు వినతిపత్రం అందజేస్తున్న కేసానుపల్లి రైతులు

కోట్ల వరకు ఉందన్నారు. కొన్ని పొలాలు ఎల్‌టీనగర్‌కు దగ్గరగా ఉన్నాయని, మున్సిపాలిటి రిజిష్టర్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. కేసానుపల్లి పొలాలకు దగ్గరలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఫార్మసీ కాలేజి, ఇంజనీరింగ్, న్యాయ కళాశాల, అగ్రికల్చర్ కాలేజీలు ఉన్నాయన్నారు. 167-ఏ జాతీయ రహదారి కింద భూమిని కోల్పోతున్న రైతులందరికీ నరసరావుపేట రెవెన్యూ రైతులకు ఇచ్చిన పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోట్ల లక్ష్మీనారాయణ, వెంకట గోపి, తాతపూడ సంజీవరావు, మంచు సునీత, కోట కిరణ్‌కుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



వివాద స్థలంలోకి ఇరువర్గాలను అనుమతించవద్దు

● తహసీల్దార్ ఉత్తర్వులు

ఫిరంగిపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని శాంతిపేటలో గల 3.50 సెంట్ల వివాద స్థలంలోకి ఇరువర్గాలను అనుమతించవద్దని స్థానిక ఎస్ఐకి తహసీల్దార్ కే ప్రసాద్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజులుగా జరుగుతున్న స్థల వివాదంలో సీఐ దురుసు ప్రవర్తనతో ఓ వ్యక్తి ని తుపాకితో కొట్టడం, ఆపై స్థానికులు సీఐని తరిమికొట్టడం, సీఐ సైడ్ కాల్వలో పడిపోటం, 3 గంటల పాటు రాస్తారోకో చేశా రు. దీంతో శాంతిపేటకు చెందిన ప్రజలు స్థానిక తహసీల్దార్, డీఎస్పీ టీ మురళికృష్ణ, పంచాయతీ ఈవోలకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ వివాద స్థలం.. పొలేరమ్మ గుడి స్థలంగా 3.50 సెంట్ల స్థలం ఉన్నదని, దీనిని గ్యారా చిన్నికుమార్ తన ఇద్దరు కుమారులకు గిఫ్ట్ డీడీగా ఇచ్చారని తెలిపారు. దీనిపై కాలనీవాసులు అధికారులకు వినతి పత్రాల ద్వారా విషయం తెలిపిన సందర్భంగా.. వివాదాలు చెలరేగుతాయనే నేపథ్యంలో సీఆర్‌పీసీ 145 కింద ఆరు నెలల పాటు ఇరువర్గాలు ఆ స్థలంలోకి వెళ్లకుండా చూడాలని తహసీ ల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు.



వివాద స్థలంలో కొలతలు తీస్తున్న అధికారులు



శాంతిపేటలో ఇరువర్గాల సమక్షంలో కొలతలకు సిద్ధమైన అధికారులు

● కొలతలు తీసిన రెవెన్యూ అధికారులు

శాంతిపేటలో వివాదంలో ఉన్న స్థలంలో బుధవారం రెవె న్యూ, పంచాయతీ అధికారులు కొలతలు తీశారు. ఇరువర్గాల పెద్దల సమక్షంలో అధికారులు కొలతలు వేశారు. కార్యక్రమంలో ఆర్ఐ షేక్ రెహమన్, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో శ్రీనివాస్, ఈవో కిషోర్‌బాబు, సిబ్బంది, పెద్దలు పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడాకారులు రాష్ట్రఖ్యాతిని పెంచాలి

◆ శాప్ చైర్మన్ రవినాయుడు ◆ వీవీఐటీయూలో నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్

పెదకాకాని, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆర్చరీ క్రీడాకారులు అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్రఖ్యాతిని పెంచాలని శాప్ చైర్మన్ రవినాయుడు కోరారు. వాసిరెడ్డి వెంకటాద్రి అంతర్జాతీయ సాంకేతిక విశ్వవిద్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరుకూరి లెనిన్ వోల్గా మెమోరియల్ "నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్" పోటీలను శాప్ చైర్మన్ రవినాయుడు, అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీత సంజీవ సింగ్, వీవీఐటీయూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆర్చరీ క్రీడకు విశేష ఆదరణ లభిస్తుందని, ఆంధ్రప్రదేశ్‌లో ఆర్చరీ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న చెరుకూరి లెనిన్ వోల్గా అసోసియేషన్ కృషి ప్రశంసనీయం అన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఏపీ క్రీడాకారులు అంతర్జాతీయంగా రాణించడమే సీఎం చంద్రబాబు లక్ష్యం అని తెలిపారు. అమరావతి వేదికగా స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటునట్లు వివరించారు. వీవీఐటీయూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ఆర్చరీ వంటి క్రీడల ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. మార్చి 26 నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు వీవీఐటీయూ క్యాంపస్ నందు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు దేశంలో వివిధ ప్రాంతాల నుంచి 900 మంది ఆర్చరీ క్రీడాకారులు, కోచ్‌లు హాజరయ్యారని, అండర్ 10, అండర్ 13, అండర్ 15 విభాగాలుగా నిర్వహించనున్న పోటీలలో తొలి రోజున 723 మంది పోటీదారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీయూ ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఎన్. అరుణ్ కుమార్, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ జనరల్ సెక్రటరి చెరుకూరి సత్యం తదితరులు పాల్గొన్నారు.



నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న శాప్ చైర్మన్ రవినాయుడు, వీవీఐటీయూ చైర్మన్ విద్యాసాగర్ తదితరులు

నేడు గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు

● అధ్యక్ష పదవికి చతుర్ముఖ పోటీ

గుంటూరు(లీగల్), మార్చి 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్‌కు 2025-26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు గురువారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది అధ్యక్ష పదవికి చతుర్ముఖ పోటీ నెలకొంది. అధ్యక్ష పదవికి యంగలశెట్టి శివ సూర్యనారాయణ (బబ్లూ), మధిర నాగేశ్వరరావు, కాజా భరద్వాజ, నంబూరు పాములు నలుగురు పోటీ పడుతున్నారు. ఉపాధ్యక్ష పదవికి మాలే దేవరాజు, చింతా రామ కోటిరెడ్డిల మధ్య ద్విముఖ పోరు జరుగుతుంది. ప్రధాన కార్యదర్శి పదవికి యరసాని అజయ్ కుమార్, మొఘల్ కాలేషా బేగ్, మోదుకూరి శ్రీనివాసరావు లు ముగ్గురు పోటీపడుతున్నారు. జాయింట్ సెక్రటరి పదవికి కొమ్మినేని చంద్రశేఖర్, ఐ విజయ్ వర్మల మధ్య ద్విముఖ పోరు నడుస్తుంది. ట్రెజరర్ పదవికి గూడూరి అశోక్ కుమార్, జీవీఎస్‌ఆర్‌కేఎస్ చంద్రన్ లు, లైబ్రరి సెక్రటరి పదవికి ఎం పాపిరెడ్డి, బొప్పా శ్రీనివాసరావులు పోటీలో ఉన్నారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరి పదవికి కుప్పాల హనుమంతరావు, గండికోట శేషగిరిరావులు పోటీ పడుతుండగా, లేడీ రెప్రజెంటేటివ్ పదవికి అడపా ఇందిర, పురాణం కళ్యాణిలు పోటీలో ఉన్నారు. నాలుగు సీనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులకు గాను మోర్ల బాల సుందరి, దాదా కరీం మొహమ్మద్, బండ్ల కృష్ణ, పల్లె నరసింహారావు, పొట్టిమూర్తి సురేష్‌కుమార్‌లు పోటీలో ఉన్నారు. మూడు జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులకు లింగాల మారుతీ శివ నాగప్రసాద్, షేక్ రెహానా బేగం, పెరుమాళ్ళ శివరంగ నాయకులు, రాయపూడి శ్రీనివాసరావులు నలుగురు పోటీపడుతున్నారు. లేడీ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు కుందేపు కవిత, మందా విజయ కుమారిల మధ్య ద్విముఖ పోరు జరుగుతోంది. మొత్తం 2016 మంది న్యాయవాదులకు ఈ ఎన్నికలలో ఓటు హక్కు వుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు పోలింగ్ నిర్వహించి 5 గంటల నుంచి పోల్ అయిన ఓట్లు లెక్కించి ఫలితాలు రాత్రికే వెల్లడించనున్నారు.

ప్రభుత్వ భవనాలపై.. ఫోకస్

(5వ పేజీ తరువాయి)

నిర్మాణ పనులను రూ.1112.74 కోట్లతో చేపడుతున్నారు. టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలు ఆయా ప్రాంగణాల్లో జంగిల్ క్లియరెన్స్ చేశాయి. అసంపూర్తిగా నిలిచిన భవనాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాల్ని తొలగిస్తూ మొత్తం ప్రాంతాన్ని శుభ్రం చేయించాయి. 2019 నాటికి కొన్ని 90 శాతం, మరికొన్ని 50 శాతం, ఇంకొన్ని పునాదుల దశ వరకు నిర్మాణపనులను జరుపుకున్నాయి. వీటిని అన్ని హంగులతో, పూర్తి మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గెజిటెడ్ అధికారులు, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-డీ అధికారుల కోసం మరో 1440 ఫ్లాట్‌ల నిర్మాణాన్ని గత టీడీపి ప్రభుత్వ హయాంలో చేపట్టగా అవి 66శాతం వరకు పూర్తయ్యాయి. ఇక నాన్ గెజిటెడ్ ఉద్యోగుల కోసం నేలపాడు వద్ద మరో 1995 ఫ్లాట్లు వచ్చే విధంగా బహుళ అంతస్తులతో కూడిన భవన నిర్మాణాలను చేపట్టి 62 శాతానికి పైగా పూర్తి చేశారు. వీటన్నింటిని ఇపుడు మళ్లీ పూర్తిస్థాయిలో పునర్నిర్మించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. ఏఐఎస్, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, హైకోర్టు జడ్జిలకు సంబంధించిన బంగ్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణాలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించగా 2019లో నిలిచిపోయాయి. ముళ్ల కంపల నడుమ పాడుపడినట్లున్న ఈ భవన సముదాయాల పనులను ప్రభుత్వం తాజాగా చేపట్టింది. నిర్దేశించిన గడువుకన్నా ముందరే ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని ఆయా సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లో గడువు పెంచేది లేదని తేల్చిచెప్పింది. నాణ్యత విషయంలో రాజీ పడటానికి వీలులేదని సూచించింది. ఈ భవన సముదాయాల్లో అంతర్గత రహదారులను ఏర్పాటుచేయడంతోపాటు ఇంటీరియర్ వర్కులు, ఫ్లోరింగ్, సీలింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు.



అమరావతిలో పునర్నిర్మాణం జరుపుకుంటున్న ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలు

ప్రకృతి వ్యవసాయం కోసం కలిసికట్టుగా పనిచేయాలి

రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామారావు

గుంటూరు సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీ రామారావు స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ, సెర్ప్ సంస్థల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం సుస్థిర వ్యవసాయం దిశగా అడుగులు వేస్తోందని, జాతీయ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కార్యక్రమ అమలులో భాగంగా మేనేజ్ జాతీయ సంస్థ ఆర్థిక సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో మూడురోజుల రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం గుంటూరు పట్టణంలోని రాయల్ పార్క్ హోటల్ నందు బుధవారం ప్రారంభమైనది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వ్యవసాయ శాఖకు చెందిన డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, సెర్ప్ నుంచి డీపీఎం, ఏపీఎం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ సలహాదారులు,రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ డీవీ రాయుడు మాట్లాడుతూ రసాయనిక వ్యవసాయం కారణంగా మొక్కలు, సూక్ష్మజీవుల మధ్య ఉండే సంబంధం బాగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిలో ఉచితంగా లభ్యం అయ్యే సూర్యకాంతిని వ్యవసాయ రంగానికి సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా పంట ఉత్పాదకతను పెంచుకోవచ్చని తెలిపారు. ప్రొఫెసర్ దబోల్కర్ పరిశోధనలను ప్రస్తావిస్తూ బహుళ పంటల సాగు విధానాలు ఒక ఎకరా విస్తీర్ణంలో ఐదు ఎకరాలకు సమానమైన ఉత్పాదకతగా మార్చగలవని వివరించారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, నీటి కొరత, పర్యావరణ సంక్షోభాలు ప్రధాన సమస్యలుగా పేర్కొన్నారు. అధిక రసాయనిక ఎరువుల వినియోగం కారణంగా భూసారం తగ్గిపోవడం, కార్బన్ వ్యర్థాలు పెరగడం, నీటి కాలుష్యం వంటి ప్రభావాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం మెరుగుపడి, దిగుబడి పెరిగి, ఆహార పోషక విలువలు మెరుగవ్వడంతో పాటు పర్యావరణ స్థిరత్వం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, మేనేజ్ సంస్థ టెలీ సలహాదారు ఐశ్వర్య, సీనియర్ థిమాటిక్ లీడ్‌లు చంద్రశేఖర్, గోపీచంద్, డాక్టర్ జాకీర్ హుసేన్, థిమాటిక్ లీడ్ సురేష్, సీనియర్ రిసోర్స్ పర్సన్ రామచంద్రం, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రామారావు, చిత్రంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డీవీ రాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

అద్దె బకాయిలు చెల్లించకపోతే చర్యలు

● పెదనందిపాడులో రూ.9.92 లక్షల వసూలు.. జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దెదారులు బకాయిలు వెంటనే చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ హెచ్చరించారు. బుధవారం ఆయన గుంటూరు జిల్లా పరిషత్‌లో మాట్లాడుతూ జడ్పీ అద్దె బకాయిల వసూలు కోసం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశామని చెప్పారు. అందులో భాగంగా పెదనందిపాడులో రూ.16.74 లక్షలు అద్దె బకాయిలు ఉండగా, స్పెషల్ డ్రైవ్ లో రూ.9.92 లక్షలు వసూలు చేసినట్లు వెల్లడించారు. చాలా మంది జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ లు వాడుకుని అద్దెలు చెల్లించే విషయంలో నిర్లక్ష్యంగా వుంటున్నారని, అటువంటి వాళ్ళ విషయంలో కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు.

29 జరగాల్సిన జడ్పీ సమావేశం వాయిదా

గుంటూరు సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29వ తేదీన గుంటూరులో జరగనున్న ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా బుధవారం తెలిపారు. 2025 - 2026 సంవత్సర బడ్జెట్‌లో ప్రభుత్వ పథకాలను అదనంగా చేర్చవలసి ఉన్నందున, మెజార్టీ సభ్యులు కొంత సమయం కోరిన కారణంగా వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని ఆమె పేర్కొన్నారు.

4 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

యడ్లపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఏప్రిల్ 4,5,6 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలుగు నాటక పరిషత్‌ల సమ్మేళనం(వేదిక), పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీల వివరాలను వెల్లడించారు. యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 4న రాత్రి 7.30గంటలకు చిగురు మేఘం, 9..30కు కిడ్నాప్, 10.30కు విడాకులు కావాలి, 5న రాత్రి 7.30కు జనరల్ బోగీలు, 8.30కు నా శత్రువు, 9.30కు రుతువులేని కాలం, 10.30కు గురితప్పిన వేట, 6న రాత్రి 7.30కు నాన్న నేను వచ్చేస్తున్నా, 8.30కు బ్రహ్మస్వరూపం, 9.30కు బావా ఎప్పుడు వచ్చితివి మొదలగు నాటికలు ప్రదర్శితమవుతాయని సురేష్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

మాచర్ల రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఐసర్ వెహికల్ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన మాచర్ల పట్టణ శివారులోని ఎంఎస్ఆర్ టౌన్‌షిప్ వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం నారాయణపల్లికి చెందిన ఎస్ ఇంద్రసేనారెడ్డి (26), ప్రకాశం జిల్లా మార్కాపురంకు చెందిన కాశిరెడ్డి (30)లు హైదరాబాద్ నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనం (ఏపీ39ఎన్‌క్యూ 1977)పై మాచర్ల వైపు వస్తుండగా ఎంఎస్ఆర్ టౌన్‌షిప్ వద్ద మాచర్ల వైపు నుంచి మొక్కజొన్న లోడుతో వెళ్తున్న ఏపీ29టీఏ 7692 ఐసర్ వెహికల్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇంద్రసేనారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, కాశిరెడ్డిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన ఐసర్ వెహికల్ డ్రైవర్ పరారయ్యాడు. విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇంద్రసేనారెడ్డి ఆర్మీ జవానుగా విధులు నిర్వహిస్తున్నారు.



ఇంద్రసేనారెడ్డి (ఫైల్)

హత్యాయత్నం కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

మంగళగిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భార్యపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. తాడేపల్లికి చెందిన సంధ్యారాణిపై భర్త తగరపు నాగరాజు కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితురాలు సంధ్యారాణి సెప్టెంబరు 3, 2022న ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోర్టు విచారణలో నాగరాజుపై నేరం రుజువు కావడంతో నాగరాజుకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి ఎం.అంజనీ ప్రియదర్శిని బుధవారం తీర్పు వెలువరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రెంటపల్లి రాజేష్ బాధితురాలి తరఫున వాదనలు వినిపించారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : స్కూటీపై ఇంటికెళుతున్న ఓ వ్యక్తి డివైడర్‌ను ఢీకొని పడిపోయాడు. ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పట్టణ ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కంకటపాలెం గ్రామానికి చెందిన రావిపూడి సురేష్‌బాబు (66) బుధవారం స్కూటీపై బాపట్ల వచ్చి తిరిగి ఇంటికెళ్ళే సమయంలో విలియంబూత్ జూనియర్ కళాశాల వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు, పడిపోయిన ఆయనను స్థానికులు 108 ద్వారా ఏరియావైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



రావిపూడి సురేష్ (ఫైల్‌ఫొటో)

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం బుధవారం నాటికి 521.20 అడుగులు ఉంది. ఇది 151.47 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,508 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 25,036 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,45,568 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,46,260 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,45,568 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 70,065 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12600
నంబరు. 5	10000	13100
273	10000	12600
341	10000	14100
4884	10000	11700
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13300

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12000
బ్యాడిగి 355	10000	13000
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10200	12500
ఆర్మూరు	10000	11200
తాలుకాయలు	5000	6500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

మంచి ప్రభుత్వానికి సంకేతమే ఘన విజయం

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మంచి ప్రభుత్వం సంకేతకంగా గ్రాడ్యుయేట్స్ అంతా కలిసి తనకు అఖండ విజయాన్ని అందించారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆలపాటి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి గత ప్రభుత్వం చేసిన తప్పులు సరిచేసుకుంటూ గాడితప్పిన పాలన గాడిలో పెడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో దశలవారిగా అభివృద్ధి చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు కావాల్సిన వనరులను సమకూరుస్తున్నారన్నారు. అమరావతిని అభివృద్ధి చేయటం, పోలవరం నిర్మాణం పూర్తి చేయటం బాధ్యతగా తీసుకున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లతో కలిసి సీఎం చంద్రబాబునాయుడు ముందుకెళుతూ ప్రజలలో ఆనందం నింపేందుకు కృషి చేస్తున్నారన్నారు.

ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలకు విశ్వాసం పెరిగిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అద్భుతమైన మెజార్టీతో గెలిపించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు చేస్తున్న మంచిపాలనకు విజయం చేకూర్చారన్నారు. సమావేశంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు తోట నారాయణరావు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల శివ, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షుడు వై.భూపతిరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు తాతా జయప్రకాష్ నారాయణ, మానం విజేత, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ జిట్టా ప్రమీలా రాణి, జనసేన నాయకురాలు గుంటుపల్లి తులసీకుమారి, చెన్నుపాటి హైమావతి, కాగిత నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వర్మి కంపోస్ట్ తయారీ విధానంపై రైతులకు శిక్షణ

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాలలో వర్మి కంపోస్ట్, వర్మివాష్ తయారీ విధానాలపై ఐసీఏఆర్ ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంట వ్యర్థాలు, కిచెన్ వ్యర్థాలను ఉపయోగించి వానపాముల ద్వారా ఎరువులను తయారు చేయటంలో మెళుకువలను నేర్పించారు. వర్మికంపోస్ట్ వినియోగం వలన భూమికి కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. శిక్షణకు బాపట్ల, గుడిపూడి, రేటూరు, ముత్తాయపాలెం గ్రామాలకు చెందిన 52 మంది ఎస్సీ, ఎస్టీ రైతులు, మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధినేత డాక్టర్ ఎం.లత, మేనేజర్ డాక్టర్ కె.హేమ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ఇన్‌చార్జి డాక్టర్ కె.సుశీల, వర్మి కంపోస్ట్ విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన మహిళా రైతులతో అధ్యాపకులు, విద్యార్థులు

కూరగాయల నారు పెంపకంపై అవగాహన

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ఆవరణలోనే కొద్ది ప్రదేశంలో కూడా కూరగాయల పెంపకం చేపట్టి ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి తెలిపారు. వ్యవసాయ కళాశాల ఉద్యానవిభాగం ఆధ్వర్యంలో కూరగాయల నారు పెంపకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి అసోసియేట్ డీన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఈపెంపకాన్ని మహిళలు చేపడితే అది వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఉద్యాన విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీలత, నారుపెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. విస్తరణ విభాగాధిపతి డాక్టర్ ఎం.సురేష్‌కుమార్ అధిక దిగుబడులను పొందే విధానంలోని మెళుకువలు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్.రత్నకుమారి, డాక్టర్ కె.సుశీల, డాక్టర్ జి.స్నేహలీల, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ అనుసంధానంపై రైతులకు శిక్షణ

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ అనుసంధానాలపై బుధవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ఆర్థికశాస్త్ర విభాగం వారు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి మండల వ్యవసాయాధికారి టి.బాలాజి గంగాధర్ మాట్లాడుతూ వరి మాగాణిలో కోత అనంతరం పండించిన పెసరకు ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.8,682 కల్పిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల మార్కెటింగ్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం దగ్గరకెళ్ళి క్షేత్ర సందర్శన చేశారు. మార్కెట్‌లో అపరాలు తక్కువ ధరకు కొంటుంటే ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ఆర్థిక విభాగ ప్రొఫెసర్‌లు డాక్టర్ కె.ఎస్.ఆర్.పాల్, డాక్టర్ ఎస్.హైమ జ్యోతి, డాక్టర్ కె.సుశీల, డాక్టర్ వి.సీతారాంబాబు, పీహెచ్‌డీ, పీజీ విద్యార్థులు, పొన్నపల్లి, గూడవల్లి, నడింపల్లి, బాపట్ల, పండిళ్ళపల్లి రైతులు పాల్గొన్నారు.

డ్రెయినేజి మరమ్మతులు పరిశీలన

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 2వ వార్డు క్రిస్టియన్‌పేట, రామకృష్ణపురంలలో నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రెయినేజి పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. త్వరితగతిన డ్రెయినేజీలు ఆధునీకరించాలని సిబ్బందిని ఆదేశించారు. దోమలబెడద ఎక్కువగా ఉన్నందున వార్డులలో ప్రతిరోజు ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా పారిశుధ్య కార్మికుల హాజరుపట్టిని పరిశీలించి అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో టీపీవో ఎస్.మల్లికార్జునరావు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ జి.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ప్రచార రథం ప్రారంభం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నవదయం 2.0 గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని బుధవారం ప్రారంభించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానిక సూపరింటెండెంట్ జి.దేవదత్తుతో కలిసి ప్రారంభించి అనంతరం స్వావర్టుపురం, బేతపూడి గ్రామాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాటుసారా నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, సీఐ పి.గీతిక, ఎస్ఐలు డి.ప్రభుదాసు, ఎస్.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహం దగ్ధం

కర్లపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల బుధవారం మండలంలోని దమ్మనవారిపాలెం గ్రామానికి చెందిన నల్లమోతు అర్జునరావు గృహం దగ్ధమైంది. ఈ అగ్నిప్రమాదంలో బాధితుడు అర్జునరావుకు రూ.5 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు వీఆర్‌వో పోతురాజు తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి బియ్యం అందజేసినట్లు చెప్పారు.

బదరికేదారేశ్వరస్వామి దేవాలయ వార్షిక వేడుకలు

కర్లపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం శ్రీగంగా గౌరి సమేత బదరికేదారేశ్వరస్వామి శివాలయం వార్షిక వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గణపతిపూజ, మహాన్యాసపూర్వక అభిషేకాలు, రుద్ర హోమం, గణపతిహోమం, నవగ్రహాల హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇసుకపల్లి మారుతి, వాసుశర్మ, సాయిబాబుశర్మ, వేదపండితులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తుఫాన్ షెల్టర్లు



తుఫాన్ షెల్టర్ వెనుక భాగంలో లోపలకు చొచ్చుకు వెళ్ళిన పిచ్చిచెట్లు

రేపల్లె, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో తుఫాన్‌ల నుంచి రక్షణ పొందేందుకు 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి తుఫాన్ షెల్టర్లను నిర్మించింది. నిజాంపట్నం హార్బర్ ఎక్స్‌మిలటరీ కాలనీలోని తుఫాన్ షెల్టర్‌కు పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి గోడల్లోకి చొచ్చుకుని వెళ్ళటంతో గోడలు బీటలువారుతున్నాయి. గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో వాటి ఆలనాపాలన చూడకపోవటంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. తుఫాన్ ప్రభావం నుంచి ప్రజలు సురక్షితంగా ఉండేందుకు సముద్ర తీరం వెంట 8 తుఫాన్ షెల్టర్లు ఒక్కొక్క తుఫాన్ షెల్టరు రూ.2.5 కోట్లుపైనే వెచ్చించి నిర్మించారు. ప్రస్తుతం వాటి ఆలనాపాలనా సరిగ్గా లేకపోవటంతో శిథిలావస్థకు చేరే పరిస్థితి ఉందంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి తుఫాన్ షెల్టర్లకు మరమ్మతులు, పిచ్చి చెట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని తీరప్రాంత వాసులు కోరుతున్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న స్త్రీ,శిశు సంక్షేమశాఖ పీడీ డి.రాధా మాధవి తదితరులు

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

● స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ డి.రాధామాధవి

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ డి.రాధా మాధవి తెలిపారు. పట్టణంలోని బాలసదన్‌లో బుధవారం బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్‌లను ఆమె ఆవిష్కరించారు. పీడీ మాట్లాడుతూ బాల్యవివాహాలు నిర్వహించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు నీలిమా మాట్లాడుతూ బాల్యవివాహరహిత భారతదేశాన్ని రూపొందించుటకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణాధికారి పురుషోత్తం, బాలసంరక్షణాధికారి కృష్ణ, సీఫార్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ కోఆర్డినేటర్ బడుగు కిషోర్, ఫోరంఫర్ ఆర్టీఐ జిల్లా అధ్యక్షులు మద్దిబోయన అమృత్, డీసీపీవో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో చైర్మన్‌గా శేఖర్‌బాబు

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఫ్యాప్టో ప్రస్తుత చైర్మన్ బడుగు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కోశాధికారి చింతల సుబ్బారావు ఎన్నికల పరిశీలకునిగా హాజరయ్యారు. ఈ ఎన్నికలో నూతన జిల్లా చైర్మన్‌గా ఎ.శేఖర్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా కె.పిచ్చయ్య, కోఛైర్మన్‌లుగా బత్తుల వెంకటేశ్వర్లు, షేక్.గస్ సయ్యద్, డిప్యూటీ సెక్రటరీలుగా జె.వినయ్‌కుమార్, గుడివాడ అమర్‌నాథ్, డి.నారాయణ, కోశాధికారిగా దేవరకొండ ప్రసాదరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నూతన చైర్మన్ శేఖర్‌బాబు మాట్లాడుతూ కొత్తప్రభుత్వం వచ్చి 9 నెలలైన ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థికబకాయిలు చెల్లించకపోవటం శోచనీయమన్నారు.

వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



వడ్డిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రతిఏడాది వలే ఈ ఏడాది కూడా వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ కార్యాలయంలో ఛైర్మన్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి ఇఫ్తార్ విందులో వడ్డించారు. వారితో కలిసి ఇఫ్తార్ విందు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, నియోజకవర్గ పరిశీలకులు బి.శివసాంబిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, ఫరీద్, జిట్టా శ్రీనివాసరావు, పల్లం సరోజనీ, మందపాటి ఆంద్రేయ, కూచిపూడి ఝాన్సీరాణి, మండలపార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షులు వై.భూపతిరావు, షేక్ బాజి, తానికొండ దయాబాబు, కాగిత నాగభూషణమ్మ, చెన్నుపాటి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

తూర్పుజామియా మసీదులో..

రేపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఆదర్శవేదిక కమిటీ సభ్యులు బుధవారం అందించారు. పెనుమూడి రోడ్డులోని తూర్పుజామియా మసీదులో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎంతో కఠోరమైన దీక్షతో ఉపవాసాలు ఉంటున్న ముస్లింలకు గత పదిహేను సంవత్సరాలుగా ఇఫ్తార్ అందిస్తున్నామని పట్టణ ఆదర్శవేదిక కార్యదర్శి వై.కిషోర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బీవీ మోహన్‌రావు, సభ్యులు కె.వెంకటేశ్వరరావు, కె.సాంబశివరావు, ఆనందరావు, కె.నటరాజ్, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో స్వీట్లు పంపిణీ

పవిత్ర రంజాన్‌మాసంలో ముస్లింలకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈవూరి గణేష్ బుధవారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని అన్ని మసీదుల్లో ముస్లింలకు స్వీట్లను అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి కర్రా వెంకటకృష్ణారెడ్డి, పట్టణ కన్వీనర్ శేషగిరిరావు, వైసీపీ నాయకులు బాలాజీ, చిత్రాల ఓబేదు, నీలా నాంచారయ్య, అబ్దుల్‌ఖుద్దీష్, గౌస్, లియాఖత బాషా, బాజీ పాల్గొన్నారు.

రైతులకు అండగా వైసీపీ : మేరుగ

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతుకు వైసీపీ అండగా ఉంటుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, పార్టీశ్రేణులతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక అల్లాడిపోతుంటే మరోవైపు సంక్షేమ ఫలాలు నిలిచిపోవటం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ధరలు తగ్గినప్పుడు రైతులను ఆదుకునేందుకు ధరల స్థిరీకరణ నిధి గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవటం విచారకరమన్నారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలురెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గవిని కృష్ణమూర్తి, జిల్లా యువజన అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, జోగి రాజా, పిన్నిబోయన ప్రసాద్, వడ్డిముక్కల డేవిడ్, చల్లా రామయ్య పాల్గొన్నారు.

రుణాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరణ

పిట్టలవానిపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు ఆధ్వర్యంలో బుధవారం 5 శాఖలకు సంబంధించిన బ్యాంక్ మేనేజర్లతో మండల పరిషత్ సమావేశపు హాలులోసమావేశం జరిగింది. 2024-2025 సంవత్సరానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, ఈబీసీ, కాపులకు చెందిన లబ్ధిదారులకు సుమారు రూ.71 లక్షల రుణాలను అందించేందుకు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.ఏలీషా బాబు, సూపరింటెండెంట్ మధుసూదనరెడ్డి, మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లుపాల్గొన్నారు.

రేపు రుణమేళా కార్యక్రమం

వేమూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన తరగతుల సంక్షేమం యాక్షన్ ప్లాన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శుక్రవారం స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో ఉదయం 11 గంటలకు రుణమేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివన్నారాయణ తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య, కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు ఈ సందర్భంగా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. బీసీ, ఈబీసీ, కాపులలో అల్పాదాయం కలిగిన వారికి వివిధ పథకాల ద్వారా సబ్సిడీ రుణాలను అందించడం జరుగుతుందన్నారు. బ్యాంకర్లు సెలక్షన్ కమిటీ సభ్యుల సమక్షంలో రుణాలను అందించేందుకు అర్హులుగా గుర్తిస్తామన్నారు. సబ్సిడీ రుణాలు పొందవలసిన వారు రేషన్, ఆధార్, కుల ధ్రువీకరణ, ఆదాయ పత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

కొల్లూరులో...

కొల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వీకరించిన రాయితీ రుణ దరఖాస్తుల ఎంపిక ఈనెల 28వ తేదీన జరుగుతుందని ఎంపీడీవో కె.నరసింహారావు తెలిపారు. దరఖాస్తుదారులంతా ఉదయం 11 గంటలకు సంబంధిత పత్రాలతో హాజరుకావాలని కోరారు. బీసీ, ఈబీసీ, కమ్మ, కాపు, రెడ్డి, వైశ్య, కుమ్మరి కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా ఎంపిక కమిటీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు దండోరా వేయించి సమాచారం ప్రజలకు తెలియజేయాలని ఎంపీడీవో తెలిపారు.

నేడు కో-ఆప్షన్ సభ్యుని ఎన్నిక

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కో-ఆప్షన్ సభ్యుని ఎన్నిక గురువారం జరుగుతుందని ఎంపీడీవో ఎస్.వెంకటరమణ బుధవారం తెలిపారు. గతంలో కో-ఆప్షన్ సభ్యుడిగా పని చేసిన వ్యక్తి పదవికి రాజీనామా చేయడంతో మండల ప్రజా పరిషత్‌లో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు పరోక్ష పద్ధతిలో ఎన్నిక నిర్వహించబడుతుందని మండల ప్రత్యేక అధికారి బి.వేణుగోపాల్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు.

కృపానందానికి ప్రముఖుల నివాళులు

కొల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీపీ అమర్తలూరి కృపానందం భౌతికకాయాన్ని సందర్శించి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బుధవారం భౌతికకాయాన్ని మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణతో కలిసి సందర్శించి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు డి.రమాదేవి, వై.నేతాజీ, కొండయ్య, టి.కృష్ణమోహన్, ములకా శివసాంబిరెడ్డిలు మాట్లాడుతూ, తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి చివరి వరకు అలాగే జీవించడం గొప్పవిషయమన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని, ఆయన భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సీపీఎం నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, సిహెచ్ మణిలాల్, బి.అగస్టీన్, బి.సుధాకర్, బాలరాజు, బి.సుబ్బారావు, రామస్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కృపానందం భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, మురళీకృష్ణ తదితరులు


సూపర్‌సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలి

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బాపట్ల మండల కార్యవర్గ సమావేశం బుధవారం మండలాధ్యక్షురాలు కొండా అన్నమ్మ అధ్యక్షతన నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డివిజన్ కార్యదర్శి ముప్పాల పల్లవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. నివేశన స్థలాలు లేని పేదలకు పట్టణంలో 2 సెంట్లు, మండలాలలో 3 సెంట్లు చొప్పున ఇచ్చి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయంకు చేరుకొని తహసీల్దార్ షేక్.సలీమాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకులు పి.లక్ష్మి, దిండి చినలక్ష్మి, ఎస్‌డి నాగూర్‌బి తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ తాత్కాలికంగా రద్దు

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీలు, దివ్యాంగుల కొరకు శుక్రవారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ ఈనెల 28వ తేదిన తాత్కాలికంగా రద్దు చేసినట్టు కలెక్టర్ జె.వెంకటమురళి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల, పరిపాలన సౌలభ్యంలో భాగంగా మార్చి నెలలో జరగాల్సిన గ్రీవెన్స్‌ను రద్దు చేశామన్నారు. ప్రజలు శుక్రవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ కోరారు.


అగ్నిహోత్రం శేషాచార్యులు హఠాన్మరణం



శేషాచార్యులు(ఫైల్)

చెరుకుపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : రాంబొట్లపాలేనికి చెందిన అర్షవిజ్ఞాననిధి బిరుదాంకితులు అగ్నిహోత్రం శేషాచార్యులు(59) మంగళవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన ఆగమశాస్త్రం, వాస్తుశాస్త్రంలో పండితులు. 300 దేవాలయాలకు పైగా ప్రతిష్ఠలు చేశారు. సమరసతసేవా ఫౌండేషన్ జిల్లా సంస్కృతి ప్రముఖ్‌గా, జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. ఆధ్యాత్మిక, అర్చక సంఘాల ద్వారా హిందూధర్మానికి వారు ఎనలేనికృషిచేశారని జిల్లా సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ శ్రీనివాసుల శ్రీనివాస్ చెప్పారు. సహకన్వీనర్ రాయపూడి అంకమ్మచౌదరి, పొన్నపల్లి సత్యనారాయణ, యల్లాప్రగడ సీతాపతి, పడమట వెంకటేశ్వరరావు, జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ తదితరులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయుడు..



వెంకటేశ్వరరావు(ఫైల్)

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తాళ్ళూరి వెంకటేశ్వరరావు (60) బుధవారం హఠాన్మరణం చెందారు. గ్యాస్ వచ్చినట్లు చెప్పి బుధవారం స్కూల్‌కు సెలవుపెట్టిన ఆయన ఆసుపత్రికి వెళ్ళి ఇంజక్షన్ చేయించుకొని వచ్చి మధ్యాహ్నాం భోజనం చేసిన తర్వాత కుర్చీలో కూర్చొని ఉన్నపాటుగా మృతి చెందాడు. ఆయన మృతికి ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సాగు సమస్యల పరిష్కారంలో నీటి సంఘాలు కీలకం

● ఎమ్మెల్యే ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవడానికి, సాగు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపకల్పన చేసినది ఆయన మానస పుత్రిక సాగు నీటి సంఘాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. కూచిపూడి లాకుల వద్ద ఇరిగేషన్, డ్రైనేజీ శాఖాధికారుల సాగునీటి సంఘాలు, రైతులతో బుధవారం ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల పాలన కాలంలో రైతాంగం పూర్తి నిర్లక్ష్యానికి గురయ్యారని అన్నారు. సాగునీటి కాల్వలు, డ్రైనేజీ వ్యవస్థలకు నిధులు కేటాయించక నీరుకార్చారన్నారు. దీనితో కాల్వల్లో పూడికతీతలు లేక తూటికాడ, గుర్రపుడెక్క విపరీతంగా పెరిగి కొద్దిపాటి వర్షాలకు పంట నీట మునగటం, కొన్ని ప్రాంతాలలో చివరి భూములకు సాగునీరు అందక పంటలు ఎండిపోవడం జరిగాయన్నారు. రైతుల సమస్యలు గురించి నీటి సంఘాల నాయకులు, రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎక్కడికక్కడ రైతులు కాల్వలు, డ్రెయిన్‌ల సమస్యలపై అధికారులతో సమన్వయం ఏర్పరచుకుని ఈ మూడు నెలలలో సాధ్యమైనంత ఎక్కువగా పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని ఆనందబాబు కోరారు. కార్యక్రమంలో ఎస్‌సి వెంకటరత్నం, నియోజకవర్గంలోని ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు తమ్మా శివారెడ్డి, కొరటాల సాయి, డివి సుబ్బారావు, యలవర్తి కోటేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్స్ మెంబర్లు, రైతులు, డ్రైనేజీ, ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజాఫిర్యాదుల కార్యక్రమం'



మంత్రి పీఎస్ సుబ్బారావుకు అర్జీలను అందిస్తున్న ప్రజలు

రేపల్లె, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పీఎస్ మోర్ల సుబ్బారావు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని, మొత్తం పదహారు అర్జీలు వచ్చాయని తెలిపారు. వాటిల్లో ఎక్కువ మంది భూసమస్యలు, అడంగల్, 1బీలో తప్పుల తడకలను సరి చేయాలని, రేషన్‌కార్డులు, పింఛన్‌లు మంజూరు చేయించాలని అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను ఆయా కార్యాలయాలకు పంపి సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, బొర్రా సూర్యరాజు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, పడమట బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు

చెరుకుపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్నపల్లిలో బుధవారం వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అనుసంధానాలపై ఐసీఏఆర్-ఎస్సీ సబ్ ప్లాన్ కింద బాపట్ల, చెరుకుపల్లి మండల రైతులకు అవగాహన సదస్సు అపరాల కొనుగోలు కేంద్ర సందర్శన ఏర్పాటు చేశామని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీగంగాధర్ చెప్పారు. ఈ కార్యక్రమానికి బాపట్ల వ్యవసాయ కళాశాల నుంచి డాక్టర్ కెఎస్ఆర్ పాల్, ప్రొఫెసర్, హెడ్ ఆఫ్ ది అగ్రికల్చర్ ఎకనామిక్స్ డిపార్టుమెంట్, డాక్టర్ ఎస్.హైమజ్యోతి, ప్రొఫెసర్ అగ్రికల్చర్ ఎకనామిక్స్, బాపట్ల మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ హాజరయ్యారు. డాక్టర్ కేఎస్ఆర్ పాల్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలు, అపరాల కొనుగోలు ప్రక్రియ విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, వీఏఏలు, డీసీఎంఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నవోదయకు ఈపూరు ఎంపీపీ పాఠశాల విద్యార్థి ఎంపిక



నవోదయ పాఠశాలకు ఎంపికైన బాలుడిని అభినందిస్తున్న హెచ్ఎం సుభాషిణి తదితరులు

కొల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల గ్రామం ఈపూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. హెచ్ఎం సుభాషిణి తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల నవోదయ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలో ఈపూరు వరుణ్ తేజ్ అనే విద్యార్థి అర్హత సాధించాడు. నవోదయ పాఠశాలకు ఎంపిక కావడంతో విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు, విద్యా కమిటీ సభ్యులు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

రేపు ఆలపాటికి సత్కార సభ

వేమూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీగా అఖండ మెజారిటీతో విజయం సాధించిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు నియోజకవర్గ కేంద్రమైన వేమూరులోని ఎన్టీఆర్ పురవేదిక వద్ద అభినందిస్తూ ఘనంగా సత్కరించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సత్సంకల్పంతో నిర్వహించే సభా కార్యక్రమంలో జిల్లాలోని పలువురు నాయకులు పాల్గొంటారు. సాయంత్రం నాలుగు గంటలకు జంపని గ్రామ శివారు నుంచి వేమూరులోని పురవేదిక వద్దకు భారీ ర్యాలీతో రాజేంద్రప్రసాద్‌ను స్వాగతించడం జరుగుతుందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గిరిధర్

రేపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రేపల్లె బార్ అసోసియేషన్‌కు 2025-26 సంవత్సరానికి నూతన అధ్యక్షుడిగా గరికపాటి వెంకట గిరిధర్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, న్యాయవాది జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. రేపల్లెలో బుధవారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలలో ఉపాధ్యక్షుడిగా వాక వెంకట శివరాంప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పాల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా పి.జాన్‌హానక్, కోశాధికారిగా ఆళ్ల సరిబాబు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా చందోలు కోటేశ్వరరావు, లైబ్రేరియన్ విభాగానికి ఎండి జహంగీర్ బేగ్ ఎన్నికైనట్లు ఆయన చెప్పారు. కార్యవర్గ సభ్యులుగా వై.ధర్మతేజ, జి.కుమార్‌బాబు, జి.రామారావు ఎన్నికైనట్టు ఆయన ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల అధికారి అందజేశారు. నూతన కార్యవర్గాన్ని సహచర న్యాయవాదులు అభినందించారు.



రేపల్లె బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నేడు ఈబీసీ, కాపు అభ్యర్థులకు క్రెడిట్ క్యాంప్

చుండూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీలో లబ్దిదారుల ఎంపికకు రుణ అర్హత క్రెడిట్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.సుదీప బుధవారం తెలిపారు. ఈ రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్న యువత గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగే క్రెడిట్ క్యాంపునకు హాజరుకావాలని ఆమె కోరారు.



- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 కేజీబీవీలు..
- 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశాలకు నోటిఫికేషన్

పేద విద్యార్థినులకు వరం.. కేజీబీవీలు

గుంటూరు (విద్య) మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల కారణంగా చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థినులు (డ్రాపవుట్స్), తల్లిదండ్రులకు దూరమైన అనాథ విద్యార్థినులకు అవి దేవాలయాలు.. విద్యార్థినులను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పించడం తోపాటు వారి సర్వతో అభివృద్ధికి అవి బాటలు వేస్తాయి... ఆ విద్యాలయాలే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) ఇందులో ప్రవేశం కోసం ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది.

ఇంటర్ వరకు ఉచిత విద్య

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి... ఇందులో 6 నుంచి ఇంటర్ వరకు ప్రవేశం కల్పిస్తారు. ఆయా కేజీబీవీలో ప్రవేశం కోసం ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 22 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ విద్యాలయాల్లో విద్యార్థినులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యను అందిస్తారు. ఈ (2025-26) విద్యా సంవత్సరానికి గాను 6, 11తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

వీరికి ప్రాధాన్యం

అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ పరిధిలోని బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తులు **https:apkgbv.apcfss.in** అనే ద్వారా పొందవచ్చని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెసేజ్ వస్తుందన్నారు. సందేహాలకు 70751-59996, 70750-39990 నంబర్లలో సంప్రదించవచ్చు.

సాగర్ ఎయిర్‌పోర్టుకు.. భూసేకరణ



సాగర్ మినీ ఎయిర్‌పోర్టులో రన్‌పై ఉన్న శిక్షణ సంస్థకు చెందిన విమానం (ఫైల్‌ఫొటో)

నెరవేరనున్న పల్నాటి వాసుల కల



భూమి వివరాలకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు (ఫైల్‌ఫొటో)

మాచర్లటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది తీరం లో నాగార్జున సాగర్ రిజర్వాయర్, ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే బౌద్ధ మ్యూజియం, లాంచీ ప్రయాణం వంటి సదుపాయాలతో ఆకర్షిస్తోంది. దీనికి తోడు ఎయిర్‌పోర్టు నిర్మాణం మరింత దోహదపడనుంది. ఎంతో కాలం నుంచి పర్యాటకులు ఎదురుచూస్తున్న ఎయిర్‌బస్ త్వరలో నాగార్జున సాగర్ వద్ద దిగనుంది. ఇప్పటికే భూసేకరణ వేగవంతంగా సాగుతోంది.

నాగార్జున సాగర్ నిర్మాణ సమయంలో..

నాగార్జున సాగర్ నిర్మాణ సమయంలో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, నిర్మాణం అనంతరం ప్రధాని ఇందిరాగాంధీ రాకపోకల కోసం 1955లో మాచర్ల మండలం నాగులవరం పంచాయతీ దక్షిణ విజయపురి రైట్‌బ్యాంక్ వద్ద 120 ఎకరాల్లో చిన్న విమానాశ్రయాన్ని ఏర్పాటు చేశారు. తదుపరి రాకపోకలు లేక విమానాశ్రయం మూలనపడింది. 2010లో ఫ్లయిటెక్ అనే సంస్థకు కోచింగ్ నిర్వహించుకునేందుకు అనుమతులు లభించాయి. మినీ ఎయిర్‌పోర్టులో సింగిల్ ఇంజన్, రెండు సీట్ల విమానాలతో శిక్షణ పొందుతున్నారు.

ప్రస్తుత ప్రభుత్వంలో విస్తరణ దిశగా...

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో ఏడు విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. దీనిలో నాగార్జున సాగర్ ఎయిర్‌పోర్టుకు కూడా స్థానం దక్కడం విశేషం. ఎయిర్ పోర్టు నిర్మించాలంటే భూసేకరణ తప్పనిసరి. మినీ ఎయిర్‌పోర్టు సమీపంలోని బ్రహ్మానందపురంతండా, పశువేముల, నాగులవరం, చింతలతండా గ్రామాల్లోని రెవెన్యూ భూములు, అటవీశాఖ భూములు సుమారు 1670 ఎకరాలు సేకరించాల్సి ఉంది. కొనుగోలు చేయకుండానే ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండడం విమానాశ్రయం ఏర్పాటుకు కలిసొచ్చిన అంశం. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ప్రత్యక్షంగా మినీ ఎయిర్‌పోర్టు పరిసరాలను పరిశీలించారు. త్వరలోనే రెవెన్యూ భూములతోపాటు అటవీశాఖకు సంబంధించిన 500 ఎకరాలు కూడా కావాల్సి ఉండడంతో ఆ దిశగా సర్వే నిర్వహిస్తున్నారు. త్వరలోనే భూ సేకరణ ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

పర్యాటకరంగానికి ఊతం..

ఎయిర్‌పోర్టు విస్తరణ జరిగితే పూర్తిస్థాయి విమానాశ్రయంగా రూపొంది విమానాల రాకపోకలు జరుగుతాయి. దీంతో నాగార్జున సాగర్, అనుపు, ఐల్యాండ్ మ్యూజియం, బుద్ధ పూర్ణిమ, ఎత్తిపోతల వంటి ఆకర్షణీయ ప్రదేశాలు పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి. నాగార్జున సాగర్ జలాశయం పూర్తిస్థాయిలో నిండి స్పిల్‌వే ద్వారా దిగువ కృష్ణానదికి పరుగులు పెడుతున్నపుడు పర్యాటకులు సాగర్‌ను సందర్శించేందుకు అమితంగా ఇష్టపడుతుంటారు. బౌద్ధ క్షేత్రంగా బాసిల్లిన నాగార్జున సాగర్‌ను సందర్శించేందుకు టిబెట్, నేపాల్, శ్రీలంక, బూటాన్ దేశాలకు చెందిన బౌద్ధ బిక్షుల రాకపోకలకు అనువుగా ఉండనుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పర్యాటకుల రాకపోకలకు, పల్నాడులో మొట్టమొదటి ఎయిర్‌పోర్టుగా స్థానం దక్కించుకోనుంది.

ఈ-క్రాప్‌లో నమోదు.. 230 మంది మాత్రమే

- యార్డులో అమ్మకందారులంతా రైతుల వద్ద కొనుగోలు చేసిన వాళ్లే
- ఇతర రాష్ట్రాల వారికి ఇక్కడ ఎంఐ స్కీమ్ అమలు అసాధ్యం
- దీనిని అవకాశంగా మార్చుకొంటున్న కొందరు వ్యాపారస్థులు



గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మిర్చికి కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) కింద ప్రకటించిన కనీస మద్దతు ధరని ఇక్కడి రైతులు పొందలేని పరిస్థితి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో నెలకొన్నది. ఈ స్కీమ్ నిబంధనలలో కీలకమైన ఈ-క్రాప్ బుకింగ్‌లో రైతులు ఎవరూ తమ పంట సాగు, విస్తీర్ణాన్ని నమోదు చేసుకోవడం లేదు. ఏ కొద్దిమందో తప్పితే మిగతా రైతులంతా పట్టించుకోవడం లేదు. మరోవైపు రైతులకు ముందుగానే పెట్టుబడి పెడుతున్న వ్యాపారస్తులు పంట చేతికొచ్చాక వేరే వాళ్ల పేర్లతో యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తుండటంతో ఈ-క్రాప్ బుకింగ్‌లో ఆ వివరాలు కనిపించడం లేదు. ఈ ఏడాది మిర్చి సీజన్ ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకు యార్డులో జరిగిన అమ్మకాలకు సంబంధించిన వివరాలను మార్కెటింగ్ అధికారులు పరిశీలన చేయగా కేవలం 230 మందికి మాత్రమే ఈ-క్రాప్ బుకింగ్ జరిగివున్నట్లు తేలింది. దీంతో వాళ్లకు మాత్రమే ఎంఎస్‌పీని అమలు చేసే పరిస్థితి ఉన్నది.

మిర్చియార్డులో ఈ సంవత్సరం వింత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందుకు కారణం సీజన్ ప్రారంభయ్యేనాటికి కోల్డ్‌స్టోరేజ్‌లలో 50 లక్షల టిక్కీలు(ఒక్కోటి 45 కేజీలు) వరకు నిల్వ ఉన్నాయి. దీని వలన వాటిని రైతులు యార్డుకు తీసుకురావడం, మరోవైపు కొత్త పంట రావడంతో మార్కెట్‌లో ధర పెరగలేదు. క్వింటాల్ రూ. 10 వేల మధ్యనే కొనసాగింది. సంక్రాంతి పండగ తర్వాత కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న నిల్వలు 20 లక్షల టిక్కీలకు తగ్గిపోవడంతో, అదే సమయంలో ఎగుమతులు ప్రారంభం కావడంతో ధరలో కాస్త పెరుగుదల కనిపించింది. క్వింటాల్ రూ. 11 వేల నుంచి రూ. 13 వేల మధ్యన కొనసాగింది. ఆ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద మిర్చికి కనీస మద్దతు ధరని రూ. 11,781గా నిర్ణయించింది. దీంతో మార్కెట్ ఊపందుకొంటుందని అంతా భావించారు. అయితే ఈ స్కీమ్ ద్వారా లబ్ధి పొందాలంటే ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి కావడంతో ఏ కొద్దిమంది రైతులకు మాత్రమే అక్కరకు వచ్చే పరిస్థితి తలెత్తింది.

నిత్యం లక్షా 20 వేల టిక్కీల విక్రయం మిర్చియార్డులో జరుగుతున్నది. రోజుకు కనీసం 1500 నుంచి 2 వేల మంది రైతులు రాష్ట్రంలోని గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా సరుకు తీసుకొస్తున్నారు. ఈ కారణంగా ఎవ్వరి పేర్లు ఈ-క్రాప్ బుకింగ్‌లో మ్యాచింగ్ కావడం లేదు. ఈ సీజన్‌లో కనీసం లక్ష మంది రైతులు తమ మిర్చిని విక్రయించి ఉంటారని అంచనా. అయితే వారిలో కేవలం 230 మంది పేర్లు మాత్రమే ఈ-క్రాప్‌లో సరితూగడం పరిస్థితికి అద్దం పడుతున్నది. ఈ విషయాన్ని గ్రహించిన కొంతమంది వ్యాపారస్థులు ధర పెరగకుండా అడ్డుకొంటున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. రైతుల మిర్చికి ప్రభుత్వం ఎంఎస్‌పీ చెల్లించలేదు కాబట్టి తేమ శాతం అధికంగా ఉందని, తాలు ఎక్కువగా ఉందని, సైజులు లేవని పేర్కొంటూ ధర కోత పెడుతున్నారు. ఈ కారణంగానే క్వింటాల్ మిర్చి నేడు మార్కెట్‌లో రూ. 7 వేల నుంచి రూ. 9 వేల మధ్యనే ఉన్నది. యార్డుకు వచ్చే సరుకులో 85 శాతం ఈ కోవలోనే ఉంటున్నాయి. కేవలం 10 నుంచి 15 శాతం మిరపకాయలు మాత్రమే నాణ్యతగా ఉన్నాయని వాటికి అధిక ధర చెల్లిస్తున్నారు.

ఆకులన్నీ రాలిన చోటే... కొత్త చిగురు





ఆకులన్నీ రాలిన చోటే... కొత్త చిగురు కనిపిస్తుంది అని ఒక కవి రాసిన పాట ఇలాంటివి చూసినప్పుడే గుర్తుకొస్తుంది. వేసవికాలం వల్ల ఆకులన్నీ రాలి మోడు బారిన కొమ్మలకు మూడు రోజుల అనంతరం కొత్త చిగురు వచ్చి ఆకుపచ్చగా గుంటూరులోని బ్రాడీపేటలో కనిపించిన చెట్టు.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి

చెన్నకేశవుని భూములు హాంఫట్

- వేల ఎకరాలు అన్యాక్రాంతం
- దాతల సహకారంతో ఉత్సవాలు
- విలువైన భూములు ప్లాట్లుగా వేసి వ్యాపారం



శ్రీ చెన్నకేశవ స్వామి మూల విరాట్



శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం

మాచర్లటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 13వ శతాబ్ధంలో పల్నాటి బ్రహ్మనాయుడు చేత పునర్నిర్మితమై పల్నాటి ప్రజల ఇలవేల్పుగా బాసిల్లిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయ వేలాది ఎకరాల భూములు కాలక్రమంలో కరిగిపోయాయి. విలువైన భూములు పరాధీనమైపోయాయి. మాచర్ల అనగానే గుర్తుకొచ్చే చెన్నకేశవస్వామి ఆలయం పూర్వకాలం నాటి భూస్వాములు, భక్తులు సమర్పించిన భూములు నేడు కబ్జాకు గురై అన్యాక్రాంతమైపోయాయి. ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడంతో ఆలయ నిర్వహణ దాతల సహకారంతో నడవాల్సిన దుస్థితి నెలకొంది..

సంపన్న చెన్నకేశవుడు..

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంకు సుమారు 3 వేల ఎకరాలు దాతల ద్వారా సంక్రమించింది. ఆలయ ధూపదీప నైవేద్యాల కొరకు పూర్వీకులు ఆలయానికి ఆ భూములు అప్పగించారు. ఆ భూముల కౌలు ద్వారా వచ్చే ఆదాయంతో ఆలయ కైంకర్యాలు, ఉత్సవాలు నిర్వహించే వారు. నిత్య అన్నదానం నిర్వహించడం కూడా జరిగేది. కాలక్రమంలో 3 వేల ఎకరాలు పరాధీనమై సుమారు 30 ఎకరాలు స్థితికి చేరుకుంది. జమ్మలమడక అగ్రహారం కింద 1200 ఎకరాలు ఉండేది. 1948 ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ద్వారా కౌలుకు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. అలాగే 1956లో కన్వర్షనల్‌ఆఫ్ ఈనామ్ యాక్టు ద్వారా ప్రభుత్వం మరో 250 ఎకరాలను పంపిణీ చేసింది. దీంతో సుమారు 1500 ఎకరాల భూమి ఆదాయం కోల్పోయింది.



రియల్ ఎస్టేట్‌గా మారిన ప్లాట్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

అన్యాక్రాంతమైన విలువైన భూములు

మాచర్ల పట్టణంలో అత్యంత విలువైన చెన్నకేశవస్వామి భూములు అన్యాక్రాంతమయ్యాయి. నరసరావుపేట రోడ్డులో రహదారికి ఇరువైపులా ఎకరం రూ. 5 కోట్లు విలువ చేసే భూములు ఆక్రమించుకున్నారు. ఈ భూములు అప్పట్లో ఆలయంలో పనిచేసే మేళగాళ్లు, మోతబోయలు, నాయీ బ్రాహ్మణులు, కళావంతులు, వెట్టి, వడ్రంగి, కంసలి, రజక, భట్రాజులు సాగు చేసుకొని స్వామి వారికి సేవ చేసేందుకు అప్పగించిన భూములు అవి. చాకిరి మాన్యాలుగా ఉన్న భూములను ఆయా వర్గాల ప్రజలు నుంచి పలుకబడి ఉన్న నేతలు కాజేశారు.

రియల్ ఎస్టేట్‌గా మార్చి ప్లాట్లు పెట్టి విక్రయాలు..

నరసరావుపేట రోడ్డులో బడుగు, బలహీన వర్గాల నివాస స్థలాల కోసం 20 ఏళ్ల క్రితం 15 ఎకరాలు భూమి నామినల్ రేటుకు దేవాదాయ శాఖ విక్రయించింది. దాన్ని అదునుగా చేసుకొని ఆనుకొని ఉన్న మరో 5 ఎకరాలు ఆక్రమణకు గురైంది. దీనికితోడు ఎర్ర రాయి క్వారీలకు 20 ఎకరాల పైచిలుకు పనికి రాకుండా పోయింది. క్వారీ గుంతలను కూడా పూడ్చి భూకబ్జాదారులు అమ్మేసుకున్నారు. ప్రస్తుతం చెన్నకేశవ నగర్, బైపాస్ రోడ్డుకు మధ్యలో ఉన్న 12 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్‌గా మార్చి ప్లాట్లు పెట్టి క్రయ విక్రయాలు జరుపుతున్నారు.

దాతల సహకారంతో ఉత్సవాలు..

వేలాది ఎకరాలు కలిగి సంపన్నునిగా ఉన్న చెన్నకేశవ స్వామి దశాబ్ధాల తరువాత ఆ భూములు కోల్పోయి ఆదాయం లేక దాతలు సహకారంతో ఉత్సవాలు జరుపుకునే స్థితి నెలకొంది. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలలో రోజుకో వాహనంపై ఊరేగించి రథోత్సవాలు జరుపుకుంటారు. స్వామి వారి హుండీ ద్వారా వచ్చే ఆదాయం, దాతలు ఇచ్చే చందాలతో అరకొర ఖర్చులతో ఉత్సవాలు జరుపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

16బై2013 చట్టం అమలు పరిస్తేనే...

చెన్నకేశవస్వామికి చెందిన అన్యాక్రాంతమైన చాకిరి మాన్యాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలంటే 16బై2013 చట్టం అమలుపరచాల్సి ఉంది. ఈ చట్టం ప్రకారం సర్వీసు ఈనాం భూములన్నీ తిరిగి ఆ దేవాలయానికే దక్కుతాయి. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడకపోవడంతో యాక్టు అమలు జరగడం లేదు. అన్యాక్రాంతం అవుతున్న భూములపై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆక్రమణకు గురవుతున్న భూములను కాపాడుకునేందుకు దేవాదాయ శాఖ అధికారులు చొరవ చూపకపోవడం కూడా ఆలయానికి గ్రహణంగా మారింది. రీ సర్వే జరిపి చెన్నకేశవుని భూములను తిరిగి దక్కించుకుంటే కోట్ల రూపాయలు విలువైన ఆస్థులు స్వామి వారికి దక్కనున్నాయి. ప్రభుత్వం స్పందించి చెన్నకేశవస్వామి భూములను తిరిగి రప్పించగలిగితే స్వామి వారికి పూర్వవైభవం సంతరించుకోనుంది.

జేకేసీ కళాశాలలో ఫుడ్ కోర్ట్



ఫుడ్ కోర్టును ప్రారంభిస్తున్న కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్

పసందుగా వంటకాలు

గుంటూరు (విద్య) మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని జేకేసీ కళాశాలలో బుధవారం ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేశారు విద్యార్థినీ విద్యార్థుల ఆధ్వర్యంలో తయారుచేసిన పసందైన వంటకాలు ఆహార ప్రియుల్ని ఆకట్టుకున్నాయి. వివిధ రకాల కూరలు, బిర్యాని, రైస్ ఐటమ్స్ చికెన్, కూరగాయలతో చేసిన ఆహార పదార్థాలు ఆకట్టుకున్నాయి. మొత్తం 150 పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఫుట్ కోర్టును కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ ప్రారంభించారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపీచంద్, వైస్ ప్రిన్సిపాల్ కే సాంబశివరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ఆంగ్ల అధ్యాపకురాలు నాగ సుశీల తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్ట్



అడుసుమల్లిలో అపరాల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు

ప్రభుత్వ మద్దతు ధరను వినియోగించుకోవాలి

పర్చూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అపరాల రైతులకు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను వినియోగించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.రామమోహన్‌రావు అన్నారు. బుధవారం పర్చూరు మండల పరిధిలోని అడుసుమల్లి గ్రామంలో మార్కుఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీయస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల నేతృత్వంలో ప్రారంభించారు. ఈసందర్బంగా పీఏసీఎస్ సీఈవో దొప్పలపూడి రమాదేవవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ ప్రైవేటు వ్యాపారుల నుంచి రైతులను కాపాడి నాణ్యమైన మద్దత్తు ధరను కల్పించి కొనుగోలు చేసే విధంగా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగుతుందన్నారు. అందులో భాగంగా శనగ క్వింటాకు రూ.5650, మినుములు క్వింటాకు రూ.7400, పెసలకు రూ.8682 చొప్పున ప్రభుత్వం మద్దతు ధరను కల్పించడం జరిగిందన్నారు. నాఫెడ్, మార్కుఫెడ్ సహకారంతో సొసైటీల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో ఎస్.రామ్మోహన్‌రెడ్డి, స్థానిక నేతలు రైతులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడి జన్మదిన సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ నేతృత్వంలో కేక్‌కట్ చేసి శుబాకాంక్షలు తెలిపారు.

33 మందికి ఉద్యోగావకాశాలు



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రతినిధులు

ఇంకొల్లు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఇంకొల్లు మారుతీ ఐటీఐ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలో 33 మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్గినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్ తెలిపారు. బుధవారం జరిగిన జాబ్‌మేళాలో ఐటీఐ, డిగ్రీ చదివిన అభ్యర్థులు 67 మంది హాజరుకాగా గోదావరి ఆంధ్ర మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ వారు డిగ్రీ అర్హత కలిగిన 10 మందిని నెలకు రూ.15వేల జీతంతో, ఆవిష్కరణ్ ఇండస్ట్రియల్ ప్రైవేటు లిమిటెడ్, ఇండోసోలార్ ప్రైవేటు లిమిటెడ్ వారు ఐటీఐ అర్హత కలిగిన 23మంది అభ్యర్థులను నెలకు రూ.18వేల జీతంతో మొత్తం 33 మందిని ఎంపిక చేసినట్లు మారుతీ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కారుమూడి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ప్లేస్‌మెంట్ అధికారి బి.శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాజారావు, కోఆర్డినేటర్ వినోద్, కంపెనీల ప్రతినిధులు, ఐటీఐ కళాశాల సిబ్బం ది రాఘవ, సుధాకర్, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

సాయంతో ఆర్థికంగా ముందుకు

బుర్లవారిపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యలతో ఉన్నవారికి ఉపాధి మార్గం ద్వారా భరోసా కల్పిస్తే సులువుగా జీవనం సాగిస్తారని లెట్స్ హెల్ప్ సంస్థ ప్రతినిధులు కిరణ్‌కుమార్ అన్నారు. బుర్లవారిపాలెంకు చెందిన గండు కోటేశ్వరమ్మ నిరుపేద కావడంతో సంస్థ సహకారంతో బుధవారం ఆమెకు రూ.30వేలు నగదు అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అందించిన సహకారంతో గెదెను కొనుగోలు చేసుకుని జీవనం సాగించాలని సూచించారు. ఎన్ఆర్ఐ రామిశెట్టి దిలీప్‌కుమార్, అనూష దంపతుల ఆర్థిక సహకారంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దయాకర్, డేవిడ్, రాజేష్, సాంబయ్య, ప్రకాష్, డానియేల్, రాజు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అధికారులు

మార్టూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్షల కేంద్రాలను బుధవారం స్టేట్ జనరల్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి,జిల్లా పరిశీలకురాలు గంగా భవాని పరిశీలించారు. వారు పరీక్షలు నిర్వహిస్తున్న మార్టూరు, రాయల్, శ్రీచైతన్య హైస్కూల్స్, మండలంలోని వలపర్ల హైస్కూల్‌ను పరిశీలించారు. కేంద్రాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాలలో 953 మంది విద్యార్థులకు గాను 944 మంది హాజరైనట్లు ఎంఈవో వస్రాం నాయక్ అధికారులకు తెలిపారు.

బ్రాహ్మణ సేవా సమాఖ్యకు టంగుటూరి ఎంపిక

అద్దంకిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా అద్దంకికి చెందిన టంగుటూరి ప్రకాశంను నియమించారు. ఆ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోనూరి సతీష్ శర్మ, హెచ్‌కే మనోహర్‌రావుల నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయని ప్రకాశం తెలిపారు. ఈసందర్భంగా అద్దంకిలోని బ్రాహ్మణ సంఘ నాయకులు సుబ్బారావు, పద్మనాభశర్మ, రవితేజ, పొన్నలూరి కిరణ్‌కుమార్, ప్రభాకర్, ఈదర శివప్రసాద్, శ్రీనివాసరావు, రుషి, విజయకుమార్, మణి తదితరులు టంగుటూరి ప్రకాశంను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రభుత్వ భవనాలపై.. ఫోకస్

(5వ పేజీ తరువాయి)

నిర్మాణ పనులను రూ.1112.74 కోట్లతో చేపడుతున్నారు. టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలు ఆయా ప్రాంగణాల్లో జంగిల్ క్లియరెన్స్ చేశాయి. అసంపూర్తిగా నిలిచిన భవనాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాల్ని తొలగిస్తూ మొత్తం ప్రాంతాన్ని శుభ్రం చేయించాయి. 2019 నాటికి కొన్ని 90 శాతం, మరికొన్ని 50 శాతం, ఇంకొన్ని పునాదుల దశ వరకు నిర్మాణపనులను జరుపుకున్నాయి. వీటిని అన్ని హంగులతో, పూర్తి మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గెజిటెడ్ అధికారులు, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-డీ అధికారుల కోసం మరో 1440 ఫ్లాట్‌ల నిర్మాణాన్ని గత టీడీపి ప్రభుత్వ హయాంలో చేపట్టగా అవి 66శాతం వరకు పూర్తయ్యాయి. ఇక నాన్ గెజిటెడ్ ఉద్యోగుల కోసం నేలపాడు వద్ద మరో 1995 ఫ్లాట్లు వచ్చే విధంగా బహుళ అంతస్తులతో కూడిన భవన నిర్మాణాలను చేపట్టి 62శాతానికి పైగా పూర్తి చేశారు. వీటన్నింటిని ఇపుడు మళ్లీ పూర్తిస్థాయిలో పునర్నిర్మించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. ఏఐఎస్, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, హైకోర్టు జడ్జిలకు సంబంధించిన బంగ్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణాలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించగా 2019లో నిలిచిపోయాయి. ముళ్ల కంపల నడుమ పాడుపడినట్లున్న ఈ భవన సముదాయాల పనులను ప్రభుత్వం తాజాగా చేపట్టింది. నిర్దేశించిన గడువుకన్నా ముందరే ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని ఆయా సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లో గడువు పెంచేది లేదని తేల్చిచెప్పింది. నాణ్యత విషయంలో రాజీ పడటానికి వీలులేదని సూచించింది. ఈ భవన సముదాయాల్లో అంతర్గత రహదారులను ఏర్పాటుచేయడంతోపాటు ఇంటీరియర్ వర్కులు, ఫ్లోరింగ్, సీలింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు.

ఉపాధి అక్రమాలు తనిఖీలలో వెలుగుచూసేనా?

- వైసీపీ హయాంలో పనులలో పెద్ద ఎత్తున అవినీతి
- మండల సర్వసభ్య సమావేశాల్లోనూ ప్రశ్నించిన ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు



రామాయపాలెంలో ఉపాధి హామీ పథకం ఆడిట్ బృందం ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రామ సభ

అద్దంకి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆడిట్ బృందం అద్దంకి మండలంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలు మొక్కుబడిగా నిర్వహి స్తున్నారా లేక అ క్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి అద్దంకి మండలంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన తనిఖీలు 27వ తేదీ వరకు జరగనున్నాయి. ఆయా గ్రామాలలో జరిగిన పనులను డీఆర్‌పీలు తనిఖీ చేసి గ్రామసభ నిర్వహించి గుర్తించిన లోపాలు చదివి వినిపించాలి. అయితే తనిఖీలు, గ్రామసభలు అంతా మొక్కుబడిగా సాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో అద్దంకి మండలంలోని ఉపాధి హామీ పనులలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని అప్పట్లోనే అదే పార్టీ కి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలలో నిలదీశారు. అయినా అధికారులు స్పందించలేదు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఇటీవల వరకు కూడా అప్పటి అధికారులే కొనసాగడంతో అప్పటి అక్రమాలు వెలుగులోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఆయా గ్రామాలలో గ్రామ సభలు కూడా మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆయా గ్రామాలకు సంబంధించి గ్రామ సభలకు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాల్సి ఉండగా ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అప్పటి కప్పుడు సమాచారం ఇస్తున్నట్లు తెలుస్తుంది. అదే సమయంలో కొన్ని గ్రామాలలో కనీసం ఆయా గ్రామాలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఏపీవోలు సైతం హాజరుకాకుండా మొక్కుబడిగా డిఆర్‌పీలు మా త్రమే హజరవటం వెనుక అసలు రహస్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామ సభలో అక్రమాలు ప్రశ్నిస్తే సమాధానం చెప్ప లేక ఉపాధి హామీ సిబ్బంది ముఖం చాటేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పలు గ్రామాలలో ఉపాధిహామీ మస్టర్ల లో ఫీల్డ్ అసిస్టెంట్ లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి తమ బంధువులకు, కుటుంబ సభ్యులకు, వైసీపీ నేతల కుటుంబాలలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, నిత్యం తెల్లచొక్కాలు వేసుకొని అద్దంకి పట్టణంలో ఉండే నేతలకు సైతం మస్టర్లు వేసినట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఆడిట్ బృందం తనిఖీలలో లోతుగా పరిశీలిస్తే పలు గ్రామాలలో చోటు చేసుకున్న అవినీతి వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలా కాకుండా వచ్చామా... వెళ్లామా అనే విధంగా వ్యవహరిస్తే తనిఖీలు చేసి కూడా ప్రయోజనం ఏముంటందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మండల స్థాయిలో జరిగే ప్రజా వేదిక కైనా ప్రజా ప్రతనిధులకు, కూలీలకు, ప్రజలకు ముందస్తు సమాచారం ఇచ్చి నిర్వహిస్తే కొంత మేర ఫలితం ఉంటుందని, అలా కాకుండా గ్రామసభలు నిర్వహించిన విధంగానే మమ అనిపిస్తే అ క్రమాలను కప్పిపుచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం కు మరింత ఊతం ఇచ్చినట్లే అవుతుందనటం లో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికైనా ఆడిట్ బృందం, జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నాటి అ క్రమాలు వెలుగులోకి వచ్చేలా క్షుణ్ణంగా పరిశీలన చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రయాణికులకు తాగునీటి ఇక్కట్లు

- ఆర్టీసీ బస్టాండ్‌లో మంచినీటి వసతి కరువు
- పట్టించుకోని అధికారులు



బస్టాండ్ వద్ద ఉన్న ప్రయాణికులు

పర్చూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఒక్కపక్క ఎండలు మండిపోతుండగా ప్రయాణికులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు నీటి కష్టాలు తప్పడం లేదు. బస్టాండ్ నుంచి నిత్యం వందలమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. చీరాల, గుంటూరు, ఇంకొల్లు, చిలకలూరిపేట, బాపట్ల, ఒంగోలు తదితర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో నిత్యం ప్రయాణికులతో పర్చూరు ఆర్టీసీ బస్టాండ్ రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న బస్టాండ్‌లో కనీస వసతులు కరువయ్యాయి. ప్రధానంగా తాగునీటి సమస్య వేధిస్తోంది. బస్టాండ్‌లో నీరు దొరక్క, బాటిళ్ల నీరు కొనుగోలు చేసే స్తోమత లేని పేద ప్రయాణికులు అల్లాడుతున్నారు. గతంలో వేసవి ప్రారంభం కాగానే దాతలు చలివేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ఇటీవల ప్రయాణికుల తాగునీటి కష్టాలను పట్టించుకునే వారే కరువయ్యారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పంచాయతీ అధికారులు బస్టాండ్‌లో తాగునీటి వసతిని కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



చెక్కును ఈవోకు అందజేస్తున్న అనిల్‌కుమార్ దంపతులు

ధ్వజ స్తంభ శిలా మండపానికి రూ.8లక్షల విరాళం అందజేత

అద్దంకి, మార్చి26(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజ స్తంభం శిలా మండపం నిర్మాణం కు ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం కనమళ్లకు చెందిన కా ట్రగడ్డ అనిల్‌కుమార్ దంపతులు 8 లక్షల రూపాయల చెక్కును బుధవారం ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనిల్‌కుమార్ దంపతులను పూజారులు ఆశీర్వదించి, సత్కరించారు.



సమావేశంలో పాల్గొన్న ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు హరిశంకరావధాని

కుంభాభిషేకానికి పక్కా ఏర్పాట్లు

అద్దంకి, మార్చి26(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం లో మే 19వ తేదీన జరిగే కుంబాభిషేకానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్నదాన స త్రాల నిర్వహకులు సహకరించాలని ఈఓ, అసిస్టెంట్ కమీషనర్ తిమ్మానాయుడు కోరారు. కుంబాబిషేకం ఏర్పాట్లు పై బుధవారం శింగరకొండ లోని అన్నదాన సత్రాల నిర్వహక కమిటీల బాధ్యులతో ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు, పూజారులు సమావేశం నిర్వహించారు. కుంబాబిషేకానికి భారీ స్థాయిలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని సామాజిక వర్గాల అన్నదాన స త్రాలలో అన్నదానం భోజన వసతి ఏర్పాటు చేయాలన్నారు. అదే సమయంలో కుంబాబిషేకము నిర్వహణ కు శృంగేరి పీఠం నుండి సుమారు 70 మంది బృందం, స్థానికంగా 100 మంది రుత్వికులు హాజరు కానున్న నేపథ్యంలో వసతి కల్పించేందుకు అన్ని అన్నదాన స త్రాలలో కొన్ని గదులను దేవస్థానం కు కేటాయించాలని కోరారు. వేదపండితులు హరి శంకరావధాని, ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ, అన్నదాన సత్రాల నిర్వహణ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు భారీగా దరఖాస్తులు

మార్టూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బీసీ, ఈడబ్ల్యూఎస్ సబ్సిడీ రుణాలు కోసం గ్రామాల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో యూనిట్‌కు 2 నుంచి 8 లక్షల రూపాయలు రుణం మంజూరు చేసే అవకాశం ఉండడంతో, దానికి తోడు 50 శాతం సబ్సిడీ ఉండడంతో ఎక్కువమంది లబ్ధిదారులు రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్నారు. రుణాలకు సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపించే అవకాశం ఉండడంతో చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారు. మండలానికి 96 మందికి రుణాలు మంజూరుకు ప్రతిపాదనలు రాగా, మొత్తం 273 మంది దరఖాస్తుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా యద్దనపూడి మండలంలో 24 మందికి రుణాలు మంజూరుకు ప్రతిపాదనలురాగా మొత్తం 37 దరఖాస్తులు వచ్చినట్లు బుధవారం అధికారులు తెలిపారు.

గ్రామ నాయకులపై పెరిగిన ఒత్తిడి

సబ్సిడీ రుణాలు మంజూరుకు గ్రామాల్లో టీడీపీ నాయకులపై ఒత్తిడి పెరిగింది. గ్రామంలో రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్న వారు తమకు రుణం మంజూరుకు సహకరించాలని కోరుతూ గ్రామ నాయకులను కోరుతున్నారు. అయితే తక్కువ సంఖ్యలో రుణాలు యూనిట్లు మంజూరు కావడం, ఎక్కువ స్థాయిలో దరఖాస్తు చేసుకున్న వారు ఉండడంతో ఎవరికి సహకరించాలో అర్థంకాని పరిస్థితి నెలకొందని నాయకులు అంటున్నారు. మార్టూరు మండలంలో చిమ్మిరిబండ గ్రామంలో ఒక్క రుణం యూనిట్ మాత్రమే మంజూరు కావడంతో దానిని ఎవరికి ఇవ్వాలో అర్థం కాక నాయకులు తలలు పట్టుకుంటున్నారు. మరి కొన్ని గ్రామాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉందంటే అతిశయోక్తికాదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా సబ్సిడీ రుణాలు మంజూరు కాగా లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. గ్రామ నాయకులతోపాటు, బ్యాంకర్లు కూడా ఎంపిక చేసిన వారికి మాత్రమే రుణాలు మంజూరు అవుతాయి. బుధవారం నాటికి దరఖాస్తు చేసుకున్న వారి అప్లికేషన్లను పరిశీలించడం పూర్తయింది. మరి ఎవరికి రుణాలు మంజూరు చేస్తారా అని లబ్దిదారులు కొండంత ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారంతో జీవనమనుగడ



ఏరువాక కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

తోటవారిపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారం తినడం వలన జీవన మనుగడ సాఫీగా ఉంటుందని జిల్లా ఏరువాక ప్రతినిధులు డా.బాలమురళీధర్‌నాయక్, శాస్త్రవేత్త డా.ఉషారాణి పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి సుమతి ఆధ్వర్యంలో ఏరువాక కార్యక్రమంలో భాగంగా రైతులకు చిరు ధాన్యాల ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమం జరిగింది.

ముగిసిన పొలంపిలుస్తోంది

రబీ సీజన్‌కు సంబంధించి బుధవారంతో పొలంపిలుస్తోంది కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈసందర్భంగా చివరి రోజు మండల పరిధిలోని బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయక సంచాలకులు రత్నకుమారి హాజరై రైతులతో మాట్లాడారు. సాగు చేసిన మొక్కజొన్న, తగులబెట్టడం, నేలను సాగుకు కలియ దున్నడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల వీఏఏలు, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం టూర్ కోఆర్డినేటర్ వెంకటేష్, జేసీ ప్రఖర్‌జైన్, అడిషినల్ ఎస్పీ విఠలేశ్వర్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

పటిష్ట ఏర్పాట్లు చేయాలి

చినగంజాం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సీఎం టూర్ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామానికి ఏప్రిల్ 1వ తేదీన రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను బుధవారం ఆయన జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, అడిషినల్ ఎస్పీ పాండురంగ విఠలేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని వెంకటేష్ సూచించారు. ఆవులదొడ్డికొత్త గొల్లపాలెం గ్రామంలో ఏర్పాట్లు చేస్తున్న హెలిప్యాడ్, ప్రజావేదిక, అధికారులు, టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించే సభా స్థలాలను ఆయన పరిశీలించారు. జరుగుతున్న ఏర్పాట్లును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో టీ.చంద్రశేఖర్‌నాయుడు, చీరాల డీఎస్పీ మహమ్మద మొయిన్, తహసీల్దార్ జె.ప్రభాకరరావు, పలు శాఖలకు చెందిన అధికారులు, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత

అద్దంకి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కచ్చితంగా పోక్సో చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలని అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత అన్నారు. సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం హైస్కూల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయాధికారి శ్రీసీత మాట్లాడుతూ మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తారన్నారు. పాఠశాలలు, కళాశాలల, వసతి గృహాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా వ్యహరిస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా మండల న్యాయసేవాధికార సంస్థకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అపరిచిత వ్యక్తుల మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్సై పట్టాభిరామయ్య, న్యాయవాదులు మార్తా శ్రీనివాసరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గవినివారిపాలెంకు పశువైద్యులను పంపండి

గవినివారిపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో పశు వైద్యుడు లేక గేదెలు, గొర్రెలు మృత్యువాత పడుతున్నట్లు మం డల పరిధిలోని గవినివారిపాలెం గ్రామస్థులు అన్నారు. ఈమేరకు బుధవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరక్టర్ వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి గతంలో వైద్యులు ఉండగా వారిని డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతానికి పంపిన ట్లు చెప్పారు. పశువుల పెంపకంతో జీవనం సాగించే గ్రామస్థులు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. విచారణ జరిపి సమస్యను పరిష్కరిస్తామని అధికారి గ్రామస్థులకు తెలిపారు.

పాస్టర్ మృతిపై పారదర్శక విచారణ

చీరాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ సువార్తీకులు పగడాల ప్రవీణ్ మృతిపై పారదర్శకమైన విచారణ చేయాలని క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం మీడియాతో వారు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ మత బోధకుడి మరణం కలకలం రేపిందన్నారు. ఇది దారుణ ఘటన అని ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రత్నశేఖర్, ఎంఎల్ మోజెష్, పేతురు, మోహన్, దివాకర్, రవిశంకర్, రత్నరాజు, రాజేష్, పీటర్ రమేష్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పాస్టర్లు

బస్టాండ్ కాదు..బార్ స్టాండ్


అధ్వానంగా ఉన్న బస్టాండ్


తాగి పడేసిన మద్యం సీసాలు


ఆక్రమణలో ఖాళీ స్థలం

» మందుబాబులకు అడ్డా
» భయంతో దూరమైన ప్రయాణికులు

వేటపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రయాణియాకులను వివిధ ప్రాంతాలకు తరలించేందుకు ఉపకరించే వేటపాలెం బస్టాండ్ నేడు బార్ స్టాండ్‌ను తలపిస్తోంది. గతంలో చీరాల, ఒంగోలు, ఇంకొల్లు, పర్చూరు ప్రాంతాలే కాకుండా హైదరాబాద్, తిరుపతి వంటి ప్రాంతాలకు ఇక్కడ నుంచి బస్సులు వెళ్లాయి. అయితే కాలక్రమేణా చీరాల - వేటపాలెం రహదారి ఆధునికీరించడంతో బస్టాండ్ రహదారికి స్వల్పంగా దూరం అమింది. దానికితోడు అంతరించిపోతున్న బస్టాండ్ అభివృద్ధి కృషి చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈక్రమంలో బస్టాండ్ పర్యవేక్షణ లోపించడంతో చిన్నగా రాత్రుళ్లు బస్టాండ్‌లో మందుబాబులు తిష్ట వేసేవారు. దీంతో ప్రయాణికులు భయంతో అటువైపు వెళ్లడం మానేశారు. దీనిని అలుసుగా తీసుకొని బస్టాండ్ పూర్తిగా మద్యం బాబులకు నిలయంగా మారింది. ప్రస్తుతం వారు యథేచ్ఛగా పగలు, రాత్రి తేడాలేకుండా ఆ ప్రాంతంలో మత్తులో మునిగి తేలుతున్నారు. బస్టాండ్ ప్రదేశం విస్తీరణం అధికంగానే ఉండడంతో అందులో సుమారు 15సెంట్ల వరకు పెట్రోల్ బంకుకు లీజుకు ఇచ్చారు. దీంతో ఈ మేరకు డిపోకు కొంత ఆదాయంతో పాటు, స్థలం భద్రతగా ఉంది. మిగిలిన బస్టాండ్ భవనం ఉన్న ప్రదేశం కొంత మందుబాబులకు మరి కొంత స్థానికులకు పశువుల పాకగా మారుతోంది.


బస్టాండ్ స్థలంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు

ఈనేపథ్యంలో ప్రభుత్వ ఆస్తిని అక్రమార్కుల చెర నుంచి విడిపించి ఆదాయ మార్గంలోకి నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

టెండర్‌ల ద్వారా ఆదాయ మార్గానికి కృషి



అప్పట్లో నెలకొన్న వివిధ కారణాల చేత బస్టాండ్ శిథిలమైంది. ఈక్రమంలో ఆర్టీసీ ఆస్తులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే టెండర్‌లు ప్రారంభించాం. స్థలాన్ని లీజుకు అందించి ఆదాయాన్ని పెంచుతాం.

- జంజనం శ్యామల, డీఎం, చీరాల ఆర్టీసీ


అన్నమాచార్యుల విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ప్రతినిధులు

అన్నమాచార్యులకు నివాళి

అద్దంకి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 522 ఆరాధన సందర్భంగా బుధవారం దాస భారతీయ జానపద కళాక్షేత్రం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ రోడ్డులోని అన్నమాచార్యుల విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అన్నమాచార్యులు రచించిన 32 వేల వేంకటేశ్వరస్వామి కీర్తనలు ప్రతి ఒక్కరి హృదయాలను హత్తుకున్నాయన్నారు. కీర్తనలతో పాటు శ్రామికులు పాడుకునే చక్కని పాటలను కూడా రచించారన్నారు. ఈ కార్య క్రమంలో దాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, జ్యోతి చంద్రమౌళి, రిటైర్డ్ ఆర్‌జేడీ దేవపాలన, వెంకటాద్రి, మాదాల దానయ్య, పుట్టా వీరాంజనేయులు, రామిశెట్టి రవి, యరమోతు శంకరరావు పాల్గొన్నారు.


నక్కబొక్కలపాడు హెల్త్ సబ్ సెంటర్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య అరోగ్య శాఖాధికారి విజయమ్మ

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా సిబ్బంది పనిచేయాలి

బల్లికురవ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటు పనిచేయాలని జిల్లా వైద్య అరోగ్య శాఖధికారి విజయమ్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గుంటుపల్లి ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్యశాల రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆనంతరం నక్కబొక్కలపాడు గ్రామంలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేసి అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్యం ప్రజలందరికీ అందేలా సిబ్బంది అప్రమత్తతో పనిచేయాలన్నారు. ఈ తనిఖీలో వైద్యాధికారి రవితేజ పాల్గొన్నారు.

జూదాలకు దూరం కాకుంటే శిక్షలు తప్పవు

తహసీల్దార్ పార్వతి


పాత నిందితులను బైండోవర్ చేస్తున్న తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జూదాలకు స్వస్తి పలకకుంటే శిక్షలు తప్పవని తహసీల్దార్ పాలపర్తి పార్వతి అన్నారు. ఇటీవల క్రికెట్ బెట్టింగ్‌లు అంశం తెరపైకి జోరుగా ప్రచారం జరుగుతుండడంతో రూరల్ సీఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు పాత నేరస్థులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అంతేకాకుండా తహసీల్దార్ వద్ద ప్రవేశపెట్టి బైండోవర్ చేయించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను కోల్పోవద్దని సూచించారు. భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

మార్టూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గడ్డిమందు తాగిన తమ్ములూరి పెదబాబు(26) అనే వ్యక్తి గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం వేకువజామున మృతి చెందినట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన పెదబాబు ఈ నెల 23న ఆదివారం ఇంటిలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దాంతో అతనిని కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. అయితే అతను వేకువజామున మృతి చెందారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బాషా తెలిపారు.

మూడు చక్రాల స్కూటీ బోల్తా

దంపతులకు గాయాలు


గాయపడ్డ మస్తాన్‌రెడ్డి

అద్దంకి, మార్చి26(ఆంధ్రజ్యోతి): మూడు చ క్రాల స్కూటి అదుపు తప్పి బోల్తా పడటంతో దివ్యాంగుడైన మస్తాన్‌రెడ్డి, భార్య జ్యోతికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు గుంటూరుకు చెందిన దివ్యాంగుడైన అన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, భార్య జ్యోతి మూడు చక్రాల స్కూటీపై దర్శి వెళ్తుండగా బుధవారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ మస్తాన్‌రెడ్డి, జ్యోతిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

కుటుంబ కలహాలతో భర్త బలవన్మరణం

తోటవారిపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు తార స్థాయికి చేరడంతో భర్త బలవన్మరణం చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని తోటవారిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోట శివారెడ్డి(35)కు చెరుకుపల్లి వద్ద రాజోలుకు చెందిన నాగదేవతతో సుమారు 12 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. అయితే ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు చెలరేగడంతో ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మంగళవారం భార్య వద్దకు వెళ్లి కాపురానికి రమ్మని కోరగా.. ఆమె నిరాకరించడంతో బుధవారం మనస్థాపం చెంది ఇంట్లోనే ఉరికి పాల్పడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వీరికి 9, 6 సంవత్సరాల పాప, బాబు సంతానం.

ప్రభుత్వ పాలసీ మేరకే అమ్మకాలు జరగాలి

చీరాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీకి అనుగుణంగానే విక్రయాలు జరపాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో లైసెన్సీ దుకాణ దారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సకాలంలో డీడీలు చెల్లించి, సరుకు అమ్మకాలు చేయాలని సూచించారు. అలాగే చట్ట వ్యతిరేక వ్యహారాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ నాగేశ్వరరావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


దుకాణదారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు


అర్జీలను స్వీకరిస్తున్న టీడీపీ కూటమి నాయకులు

సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

చీరాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య నిరంతరం శ్రమిస్తున్నట్లు పలువురు టీడీపీ కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి అందిన నివేశన స్థలాలు - 200, పెన్షన్ - 100, రేషన్ కార్డులు - 50 అర్జీలను స్వీకరించారు. ఈసంద్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి అధికారంతో నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉండేలా ఎమ్మెల్యే ప్రణాళిక చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గంజి పురుషోత్తం, గజవల్లి శ్రీనివాసరావు, పొత్తూరి సుబ్బయ్య, గూడూరు శివరామప్రసాద్, నాగమల్లేశ్వరి, చంద్ర తదితర నాయకులు, కార్యకర్తలు, అర్జీదారులు పాల్గొన్నారు.

పంటల అమ్మకాలలో అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రైతులు తాము పండించిన పంటల అమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. బుధవారం మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏవో పలు రకాల పంటలను పరిశీలించారు. ఆనంతరం రైతులతో మాట్లాడుతు రానున్న ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు ముందస్తుగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలానే పంట ఉత్పత్తులు అమ్మకాలు చేసే రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మకాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముంద్రు దానయ్య, వీఏఏ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు ప్రసన్న, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయించండి

బల్లికురవ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో అసంపూర్తి పనులతో నిలిచి ఉన్న గృహాలను వెంటనే పూర్తి చేయించాలని ఎంపీడీవో కుసుమకుమారి అధికారులకు సూచించారు. బుధవారం అన్ని గ్రామాల సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గత ఐదేళ్లలో గృహాలు మంజూరై ఇంత వరకు పూర్తి స్థాయిలో పనులు చేయని వారిని కలిసి వెంటనే పూర్తి నిర్మాణాలు జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలి

చినగంజాం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పలు గ్రామ పంచాయతీ పరిధిల్లోని ప్రభుదేవా, సందరయ్య, మహాలక్ష్మీ అంబేడ్కర్‌నగర్, రాజమాత కాలనీవాసుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని కాలనీలలో పార్టీ బృందం సభ్యులు పర్యటించి సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు, దివ్యాంగులు బుధవారం ధర్నా నిర్వహించారు. చినగంజాం గ్రామ పంచాయతీలోని అంబేద్కర్ నగర్, సుందరయ్య, మహాలక్ష్మీ, ప్రభుదేవా కాలనీవాసులకు, మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీలోని రాజమాత కాలనీవాసులకు, ఇళ్ల పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని, మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని, రోడ్లు నిర్మించాలని, దివ్యాంగులకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో పక్కా గృహాలు నిర్మించాలని కోరుతూ ధర్నా అనంతరం తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ డేటా త్వరితగతిన పూర్తి చేయాలి డీఎల్‌పీవో


సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎల్‌పీవో

ఇంకొల్లు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పంచాయతీల డేటాను నూతన యాప్‌ల్లో త్వరితగతిన అప్‌లోడ్ చేయాలని డీఎల్‌పీవో శ్రీమన్నారాయణ ఆదేశించారు. బుధవారం పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు.మండలంలోని అన్ని పంచాయతీల డేటా యాప్‌లలో అప్‌లోడ్ చేయకపోతే 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రభుత్వం నుంచి రావని హెచ్చరించారు. జీఆర్‌డీపీ ప్లాన్ ఈగ్రామం స్వరాజ్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ జూనియర్ అసిస్టెంటు ఏ.వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ

పర్చూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఆశ్రయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు రంజాన్ పండుగను పురస్కరించుకొని బుధవారం నూతలపాడుకు చెందిన షేక్ బాజీ 25 మంది పేద వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాజీ మాట్లాడుతూ వృద్ధులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు అమ్ముకోవద్దు

మద్దతు ధరకు కొంటాం : ఏవో


బొడ్డువానిపాలెంలో శనగలు, కందులు కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసరావు

మేదరమెట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : శనగలు, కందులు పండించిన రైతులు తక్కువ ధరలకు అ మ్ముకోవద్దని, ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని యర్రబాలెం, బొడ్డువానిపాలెం గ్రామాల్లో మద్దతు ధర్పై రైతులుకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని రావినూతల, తిమ్మనపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకర పరపతి సంఘం (సొసైటీలు)లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రావినూతల కొనుగోలు కేంద్రంలో కందులు శనగలు, తిమ్మనపాలెం సొసైటీలో శనగలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కందులు క్వింటాళ్లు రూ.7,550, శనగలు క్వింటాళ్లు రూ.5,650 చొప్పున మద్దతు ధర ఇస్తున్నామన్నారు. శనగలు కందులు పండించిన రైతులు ఆయా గ్రామాలలోని వ్యవసాయ సహాయకుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులు తమ పంటల శాంపిల్స్‌ను కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువెళ్లి వారి అనుమతితో కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవచ్చన్నారు. మండలంలోని రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ అ వగాహన కార్యక్రమాలల్లో వ్యవసాయశాఖ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కందులు, శనగల కొనుగోలుకు కేంద్రం ఏర్పాటు

బల్లికురవ : రబీ సీజన్‌లో రైతులు పండించిన కందు లు, శనగలు కొనుగోలుకు ప్రభుత్వం కొమ్మినేనివారిపాలెంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని రైతులు సద్వినియెగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి తెలిపారు. ప్రభుత్వం కందులకు మద్దతు ధరగా క్వింటా రూ.7550, శనగలు క్వింటా రూ.5650 నిర్ణయించిదని తెలిపారు. నాణ్యత ప్రమాణాల మేరకు నెమ్ము శాతం 12 శాతంలోపు ఉంటే కొనుగోలు చేస్తామని విత్తనాలు అమ్మకాలు చేసే రైతులు వెంటనే గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో కోరారు.

విద్యార్థుల ప్రవర్తనను గమనించాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి సుధ

వేటపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ప్రవర్తన, కొత్తకొత్త మార్పులపై గమనించి అప్రమత్తంగా ఉండాలని న్యాయాధికారి ఎం.సుధ అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని గిరిజన పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయాధికారి ఎస్సై వెంకటేశ్వర్లుతో కలిసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కొత్త వ్యక్తులు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలన్నారు. పోక్సో ఇతర చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వలన ధైర్యంగా జీవిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేసమ్మ, పీఎల్‌వీలు మదీన్, సుభాని, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


రంగులు వేసిన సరస్వతీదేవి విగ్రహం

దాతల సహకారం మరువలేనిది

చినగంజాం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎండీ నారాయణరెడ్డి అన్నారు. పాఠశాల ఆవరణలో గ్రామపెద్దల సహకారంతో నిర్మించిన సరస్వతీదేవి విగ్రహానికి గ్రామ రామదండు యువజన సేవా సమితి సభ్యులు రంగులు వేయించినట్లు హెచ్ఎం బుధవారం తెలిపారు. రామదండు యువజన సేవాసభ్యులు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఆసోది సుదర్శన్ రెడ్డి రూ.20వేల రంగులు వేయించినట్లు తెలిపారు. పాఠశాలలో జరిగే ఆగస్టు 15, జనవరి 26వ తేదీలో జరిగే జాతీయ పండుగ దినోత్సవాలకు నిర్వహించే పలు కార్యక్రమాల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేయడం, పాఠశాల క్రీడా మైదానం, పరిసరాలను కూడా అప్పుడప్పుడు స్వచ్ఛందంగా వచ్చి శుభ్రం చేస్తున్నట్లు హెచ్ఎం తెలిపారు.


పంగులూరులో టెన్త్ విద్యార్థులకు పరీక్షా కేంద్రం వద్ద మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న వీరనారాయణ

విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

పంగులూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్ష రాసే పాఠశాలల విద్యార్థులకు ఆయా పరీక్షా కేంద్రాల వద్ద మజ్జిగ ప్యాకెట్లు అందచేస్తున్నారు అజిత్ ట్రస్ట్ ఛైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ. మండలంలోని పంగులూరు, ముప్పవరం పరీక్షా కేంద్రాలలో 5 పాఠశాలలకు చెందిన 336 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్ష రాస్తున్నారు. పరీక్ష రాసే వారితోపాటు పాటు ఆయా కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి చందలూరు గ్రామానికి చెందిన అజిత్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పరీక్ష జరిగే రోజున మజ్జిగ ప్యాకెట్లు స్వయంగా అందచేస్తున్నారు. విద్యార్థుల పట్ల వీరనారాయణ చాటుతున్న వితరణను ఉపాధ్యాయులు కొనియాడుతున్నారు.

రోడ్డుపై నిలిచిన లారీ

పర్చూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : యాక్సిల్ విరిగిపోయి రోడ్డుపై సిమెంట్ లోడ్‌తో ఉన్న లారీ నిలిచిపోయిన ఘటన పర్చూరులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డులో జరిగింది. లోడుతో ఇంకొల్లు వైపు వెళుతున్న క్రమంలో యాక్సిల్ విరిగి పోవడంతో రోడ్డుమీద లారీ వాలిపోయింది. ఈ ఘటన చూసిన సమీపంలో ప్రజలు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


రోడ్డుపై వాలిపోయిన సిమెంట్ లోడుతో ఉన్న లారీ